ఆంధ్రసారస్వతోపన్యాసాలు (5)

# పరశురామ పంతుల లింగమూర్తి

( జీవితము - సాహిత్యము )

రచయితలు :

ఆచార్య-దివాకర్ల వెంకటావధాని

శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి శిరోమణి

894.8271
VEN

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు - హైదరాబాదు-500001.

Ci

894.8271
VEN
N-10228

UTHOR వెంకటావధాని, దివాకర్ల
నరసింహశాస్త్రి, కౌశిక పంతుల

TLE పరశురామ పంతుల లింగమూర్తి

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

ఆంధ్రసారస్వతోపన్యాసాలు (5)

# పరశురామ పంతుల లింగమూర్తి

( జీవితము - సాహిత్యము )


ర చ యి త లు :

ఆచార్య-దివాకర్ల వెంకటావధాని

శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి శిరోమణి



For Favour of Review

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10228

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA D.P.R.I. Acc. No. 10228



ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు – హైదరాబాదు-500001.

ప్రథమ ముద్రణ : 1976. డిసెంబరు

ప్రతులు : 1000

వెల రు. **2-00**

T
894.8271
VEN

ప్రాప్తిస్థానము :

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు - హైదరాబాదు-500001.

ముద్రణ :
సమత పవర్ ప్రెస్,
లింగంపల్లి, హైద్రాబాద్-500027.

AOUA105B142

# తొలిపలుకు

ఆంధ్ర సారస్వత పరిషత్తు సుప్రసిద్ధములైన ఆంధ్ర మహా గ్రంథము లను గూర్చి, తత్కర్తలను గూర్చి విద్వాంసులచే ఉపన్యాసములిప్పించి వానిని పుస్తకరూపమున ప్రకటించి ఆంధ్రలోకమునకు అందజేయుచున్నది. ఈ గ్రంథము ఆ పరంపరలోనిదే.

గహనమైన యోగశాస్త్రమును మధుర కావ్యముగా రంచించిన పరశురామ పంతుల లింగమూర్తిగురుడు వరంగల్లు ప్రాంతమున జన్మించి ఎందరు భక్తులనో తరింపజేసిన యోగపుషుడు ఆయన రచించిన 'సీతారామాంజనేయ సంవాదము' ఆధ్యాత్మిక తత్త్వములతో నిండిన మహనీయప్రబంధము. విషయ గౌరవముచేతను, రచనా మహత్వముచేతను ఈ గ్రంథము అచిరకాలముననే సకలాంధ్ర దేశవ్యాప్తినందగలిగెను అది అందరికినీ సులభగ్రాహ్యముకాదు. అందుకై పరిషత్తు ఆ మహాగ్రంథమును గూర్చి తత్కర్తను గూర్చి ఉపన్యాస కార్యక్రమము నేర్పాటుచేసి ఆ విషయములను సులువుగ గ్రహించు అవకాశము కల్పించినది.

17-7-76 తేదీన 'పరశురామపంతుల లింగమూర్తి జయంతి' జరుప బడినది. పరిషదధ్యక్షులు శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారు అధ్యక్షత వహించిరి. ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు "కవి కాల కవిత్వ విశేషము"లను గూర్చి, శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి శిరోమణిగారు "కావ్యవిషయ-తత్త్వ విశేషము"లను గూర్చి ప్రసంగించిరి, ఆ ఉపన్యాసములే ఈ గ్రంథరూపమున వెలువడుచున్నవి.

విశేషజ్ఞులయిన పై విద్వాంసుల ప్రసంగములు "సీతారామాంజనేయ సంవాద" మహాగ్రంథమును అవగాహన చేసికొనుటకు తోడ్పడగలవు. ఇంత వరకును ఇట్టి ప్రయత్నము జరిగియుండలేదు. ఈ ప్రచురణము ఆంధ్రలోకము నకు ఆదరపాత్రము కాగలదని నమ్ముచున్నాము. విశేషశ్రమచేసి ఉపన్యసించిన విద్వద్వర్యులకు కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాము.

బుధ విధేయుడు,

హైదరాబాదు
18-12-76

గడియారం రామకృష్ణశర్మ
కార్యదర్శి.

# వి ష య సూ చి క


1. తొలిపలుకు :

2. పరశురామ పంతుల లింగమూర్తి జీవితము-సాహిత్యము
డాక్టర్ దివాకర్ల వెంకటావధానిగారు 1 నుండి 33 వరకు

3. సీతారామాంజనేయ సంవాదము-విశిష్టత
శ్రీ కేశవ పంతుల నరసింహశాస్త్రిగారు 34 నుండి 66 వరకు


4

For Favour of Review

శ్రీ

## శ్రీ పరశురామపంతుల లింగమూర్తి:

### కాల నివాస కవిత్వ విశేషాదులు :

ఆంధ్రవాఙ్మయకాసారమున వెల్వడిన తత్త్వసౌరభసంవాసితములైన కమనీయకంజాతములలో నగ్రగణ్యమైనది. శ్రీ సీతారామాంజనేయ సంవాదము. సుప్రసిద్ధములైన భారత భాగవత రామాయణాది గ్రంథములందుఁ గూడ నెడనెడ తత్త్వవిషయ వివరణము కనిపించినను అవి కథా ప్రధానములైన రచనలే కాని తత్త్వప్రధానములైనవికావు. అట్లుగాక కేవల మాధ్యాత్మిక వస్తు ప్రపంచనముకొఱకే రచింపఁబడిన మహనీయ మహాప్రబంధము శ్రీ సీతారామాంజనేయ సంవాదము. తత్త్వప్రధానములైన గ్రంథములలో సాధారణముగా కవిత్వాంశము మృగ్యమైయుండును. అందు కవి తత్త్వవస్తు ప్రధానము లగుటయే కారణము. అట్టి గ్రంథములలోఁగూడ మనోజ్ఞ కవితామకరందము స్యందింపఁజేయు శక్తి శ్రీ జగద్గురు శంకరాచార్యాదులందుఁ గాననగును ఆ విషయమున శ్రీ శంకరభగవత్పాదుల బంతిని నిలుపఁదగినవాఁడు శ్రీ సీతారామాంజనేయ మహాకావ్యకర్త శ్రీ పరశురామ పంతుల లింగమూర్తి.

శ్రీ లింగమూర్తి సుమారు రెండు శతాబ్దులకు పూర్వము నివసించినవాఁడే యైనను అతని జీవిత చరిత్ర విశేషము లెక్కువగా తెలియవచ్చుట లేదు. అతఁడు గ్రంథావతారికలో "పరశురామపంతులకులజాత రామమంత్రిమౌళి తిమ్మాంబికాప్రియాత్మజుఁడ" నని తన తల్లిదండ్రుల నామములను మాత్రము పేర్కొనియుండెను. గురుపరంపరను వర్ణించినంత సమగ్రముగా నతఁడు వంశక్రమమును వర్ణించియుండలేదు. అతని కుమారుఁడు శుకచరిత్రము. అధ్యాత్మరామాయణము. వివేకసారము మున్నగు గ్రంథములు రచించిన రామమూర్తి. పౌత్రుఁడు లింగమూర్తి. ప్రపౌత్రుడు రామకృష్ణ సోమయాజి. రామకృష్ణ సోమయాజికి అనంత రామయ్య. దశరథ రామయ్య అను నిరువురు

కుమారు లుండిరి. వారిలో అనంతరామయ్యకు పట్టాభిరామయ్య అను కుమారుఁడు జనించెను. పట్టాభిరామయ్యకు రాధాకృష్ణయ్య అను కుమారుఁడును అమృతాబాయమ్మ అను కూఁతురును కలిగిరి. వీరిలో అమృతాబాయమ్మ వరంగల్లు నగరమునందలి మట్టెవాడలో లింగమూర్తియు నతని వంశీయులును నివసించిన గృహమునందే నివసించుచు లింగమూర్తికి శ్రీ రామానుగ్రహమున లభించిన షట్చక్ర సీతారామసాలగ్రామము, శ్రీ రామమాడ, శ్రీ రామ పంచాయతనము, మరకత శివలింగము, స్ఫటిక గణపతి అనువానికి నిత్య పూజానైవేద్యాదులను యథావిధిగ జరిపించుచున్నది. శ్రీ లింగమూర్తి యుపయోగించిన మేనాసవారి కూడ జీర్ణస్థితిలో నిప్పుడా గృహముననున్నదఁట. అమృతాబాయమ్మ తెల్పిన విషయములను బట్టియు, రామమూర్తికవి రచించిన గ్రంథములను బట్టియు లింగమూర్తి పూర్వులను గూర్చి యీ క్రింది విషయములు తెలియవచ్చుచున్నవి

ఔరంగజేబుపాదుషా మహారాష్ట్రముపై దండెత్తినప్పు డాతని సైనికులు పెట్టు బాధలు భరింపలేక పలువురు మహారాష్ట్ర దేశమును విడిచి అన్య ప్రాంతములకు వలసపోయిరి. వారిలో దండాపంతు, శ్యామాపంతు పరశురామపంతు అను ముప్వురు తమ కుటుంబములతోఁగూడ నాంధ్రదేశమున కరుదెంచిరి, వారి సంతతి వారికి క్రమముగా వారి పేరులే గృహనామము లయ్యెను. ఈ విధముగా పరశురామ పంతుల అను గృహనామము గ్రహించిన వారు వరంగల్లునకు సమీపమందలి సెనగవరమున నివసించుచు నచ్చటి నియోగి బ్రాహణులతో సంబంధ బాంధవ్యము లేర్పఱుచుకొని తాముసు నియోగులుగా వ్యవహరింపఁబడుచుండిరి. అందుచేతనే కాఁబోలు లింగమూర్తి తన తండ్రి నామమునకు మంత్రి పదమును జేర్చి రామమంత్రి మని పేర్కొనియుండెను. నియోగి బ్రాహ్మణుల నామములకు మంత్రి, అమాత్య పదములను చేర్చుట పెక్కుచోట్ల కానవచ్చుచునే యున్నది. పరశురామ పంతులవారు భారద్వాజసగోత్రులు, ఆశ్వలాయన సూత్రులు, లింగమూర్తి వరంగల్లు సమీపమందున్న అంబాల గుట్టపై శ్రీ రామమంత్రము నుపాసించి సిద్ధిపొందెననియు, నచ్చటనున్న గుండమున స్నానమాచరించి ప్రార్థనఁ జేయుచుండఁగా నతని చేతికి శ్రీ రామ ప్రసాదముగాఁ గొన్ని విగ్రహములు లభించెననియు, నవియే తమయింట దేవ తార్చనలోఁ బూజింపఁబడుచున్నవనియు, లింగమూర్తి సజీవసమాధి నొందె

ననియు నమృతాబాయమ్మ తెలిపినది. లింగమూర్తి సమాధివారియింటి సమీపమునసే యున్నది. అచ్చట నొక హనుమద్విగ్రహము ప్రతిష్ఠింపఁబడియున్నది. లింగమూర్తికి గురుమూర్తి యనునది శిష్యులొసంగిన సార్థకబిరుదము అతని కుమారుఁడు రామమూర్తి కూడ తన గ్రంథములలో నతని గురుమూర్తి యనియే స్తుతించియుండెను. అతఁడు వివేకసారమున తండ్రిని గూర్చి రచించిన సీసదశకమునుబట్టి యతఁడు నిరంతరాత్మ నిష్ఠాగరిష్ఠుఁడై నిర్వికల్పసమాధి నొందుచుండెడి వాఁడని తెలియుచున్నది. అట్టి మహనీయుఁడు సజీవసమాధి నొందియుండుననుట సత్యమే కావచ్చును

శ్రీ సీతారామాంజనేయ సంవాదమును లింగమూర్తి తనకు శ్రీ రామ మంత్రోపదేశ మొనరించిన మహాదేవగురున కంకిత మొనర్చెను. దత్తాత్రేయుఁడు-జనార్ధనయోగి-ఏకోగురుస్వామి-నరహరి - మహేశగురుస్వామి-నాగోజీ రాముఁడు కోనేరుగురుఁడు-మహాదేవగురుఁడు- అనునది లింగమూర్తిగురు పరంపరాక్రమము. మహాదేవగురుఁడు మహామహిమ సంపన్నుఁడై కరీంనగర మండలమునకుఁజెందిన మంథెన గ్రామమున నివసించెనని తెలియుచున్నది. అతఁడు సగుణ నిర్గుణ రూపుఁడై నెగడుచుండెననియు, నతని నుతించుటకు సకలనిగమాగమాంత శాస్త్రములు కూడ చాలవనియు, నతఁడు గురుజనంబుల కెల్ల గురువులై తగు హరిహరులకుఁగూడ గురువగుచు నుండెననియు, లింగమూర్తి వర్ణించియున్నాఁడు. నాగోజీ రాముని గురువగు నరహరి మహేశస్వామి మహారాష్ట్రమున మిక్కిలి ప్రసిద్ధుఁడైన యేకనాథస్వామి శిష్యుఁడు. ఈ యేకనాథస్వామినే లింగమూర్తి యేకోగురుస్వామి యని పేర్కొని యుండెను. ఏకనాథస్వామి గురువైన జనార్ధనస్వామి దత్తాత్రేయ సాక్షాత్కారమును బొందిన మహాత్ముఁడని యేకనాథుని రచనవలనను, చరిత్రాధారమువలనను దెలియుచున్నది. దీనిని బట్టి లింగమూర్తి వంశము నందలి పూర్వులవలెనే యతని గురు పరంపరయందలి పూర్వులు కూడ మహారాష్ట్రులే యైనట్లు విదితమగుచున్నది. ఏకనాథస్వామి కీ. శ. 14వ శతాబ్ది చివరి భాగమున నివసించినట్లు మహారాష్ట్ర సాహిత్య చరిత్ర తెలుపుచున్నది. లింగమూర్తి యితని కైదవ తరమువాఁడు. వీరికి నడుమ నున్న గురువులందఱును చిరజీవులై పూర్ణపురుషాయుషమును బొందినట్లు తెలియుచున్నది. అందుచే లింగమూర్తి పదునెనిమిదవశతాబ్ది పూర్వార్ధమున నివసించెనని నిశ్చయింపవచ్చును.

లింగమూర్తి శ్రీ సీతారామాజంనేయ సంవాదారంభమున దేవతాస్తుత్యనంతరము :—

కII ఆరయమద్బాల్యంబున
గారవమునఁ జిత్తశుద్ధికరముగ నాకున్
దారకయోగముఁ దెలిపిన
నారాయణగురువులను మనంబునఁ గొలుతున్

అని తన బాల్యగురువైన నారాయణుని స్తుతించెను. అతఁడు రచించిన సాంఖ్యతారకామనస్కయోగ సీసతారావళిత్రయమునందలి పద్యముల చివర చెప్పె నారాయణస్వామి శిష్యుఁడైన లింగమూర్తి మహాగురు లింగమూర్తి యను మకుటమున్నది. అందు మహాదేవగురుని ప్రశంస కానవచ్చుటలేదు. దీనిని బట్టి మహాదేవగురునికి శిష్యుఁడగుటకుఁ బూర్వమేయతఁడు నారాయణగురువు నాశ్రయించెనని స్పష్టమగుచున్నది నారాయణ లింగమూర్తుల గురు శిష్యసంబంధమును గూర్చి లోకమున నొక యైతిహ్యము వినవచ్చుచున్నది. అందు సత్యమెంతయున్నదో తెలియదు. ఆకథ యిది. లింగమూర్తి కృష్ణామండలమునందలి యొక్క గ్రామమున నివసించుచు పఠన లేఖనములను నేర్చుకొనిన పిమ్మట యౌవనమున జీవనోపాధికై యోరుగల్లు నగరమున కరిగి యచ్చట నొక ధనిక వర్తకుని యొద్ద నాయవ్యయములను లిఖించు నుద్యోగమునఁ గుదురుకొనెను. ఆ వర్తకుఁడు పెక్కు మగ్గములను బెట్టించి, సాలెవాండ్రచే వస్త్రముల నేయించి, యమ్ముచుండెడివాఁడు. లింగమూర్తి యోరుగల్లులో పండిత శుశ్రూష గావించి కొంచెము సంస్కృతాంధ్ర భాషా పరిజ్ఞానము సంపాదించుటయే కాక తత్త్వవిద్యయందుఁగూడ నిష్ణాతుఁ డయ్యెను. యజమానుఁడైన వర్తకుఁడు గూడ తత్త్వజిజ్ఞాస కలవాఁడగుటచే పనిలేని సమయమున వారిరువురును గూర్చుండి వేదాంత విషయ విచార మొనరించుచుండిరి. వారు దురవగాహ విషయములను గూర్చి ప్రసంగించుచు వాని నొండొరులకుఁ దెలియఁజెప్పు కొనుటలో తల్లడపడుచుండ నించుక దూరమున వస్త్రములు నేయుచుండెడి సాలె నారాయణుఁడను వాఁడు విని "పో గతుకలే" దని యన్యాపదేశముగా పలుకుచుండెడివాఁడు. ఒకనాఁడు లింగమూర్తి యాతనిఁ జేరిమాటిమాటికి నాతఁ డట్లు పలుకుచుండుటకు కారణ మేమని ప్రశ్నించెను. అప్పు డాతఁడు సందేహాస్పదములైన పెక్కు విషయ

ములను లింగమూర్తికి విశదముగా బోధించెను. ఇట్లు కొంతకాలము గడచిన పిమ్మట గురుమూర్తి యాతనికడకేగి "నీవే నాకు గురుఁడవు నాకు కొన్ని యజ్ఞాత విషయములను బోధించి యనుగ్రహింపు' మని వేడుకొనెను. అంత నారాయణుఁడు "నేను శూద్రుఁడను కావున నాధ్యాత్మిక విషయముల నుపదేశింపఁగల యధికారము నాకులేదు. మాగురు పుత్త్రుఁడు మహాదేవశాస్త్రి యను మహనీయుఁడున్నాఁడు అతఁడు సర్వజ్ఞుఁడు ప్రస్తుత మతఁడు మౌనవ్రతుఁడై యున్నను నేను పంపితినని తెలిపినచో వ్రతమును విడిచి నీకు సర్వవిషయములు బోధించు" నని చెప్పిపంపెను లింగమూర్తి యతఁడు చెప్పినట్లే మహాదేవశాస్త్రిని దర్శించి, యతని శుశ్రూషగావించి, యోగరహస్యము లన్నియు నెఱింగి మహాయోగియయ్యెను. లింగమూర్తి రచనలలో మొదటిదిగా భావింపఁబడుచున్న రతిమన్మథ విలాసము హనుమంతునికి సంకితము సేయఁబడినది. గ్రంథాంత గద్యమున "శ్రీ మదాంజనేయ చరణకమల సేవావిధేయ" యని యతఁడు వ్రాసికొనెను. ఈ గ్రంథమున నాతఁడు నారాయణ మహాదేవ గురువుల నామములను బేర్కొనియుండలేదు. ఆతఁడు మొదట హనుమద్భక్తుఁడుగ నుండి, తరువాత గురువులనుండి శ్రీరామ మంత్రము గ్రహించి, యుపాసించి, శ్రీరామ భక్తుఁడయ్యెనని యూహింపవచ్చును. సాలె నారాయణుఁడు శ్రీరామ భక్తుఁడనియు, నతని కెల్లప్పుడును శ్రీ సీతారాముల సాక్షాత్కార సౌభాగ్యము గలుగు చుండెననియు, నతని భక్తిమహిమాను భావములకు సంబంధించిన కథలెన్నో వాడుకలోనున్నవనియు, నమృతాబాయమ్మ తెలుపుచున్నది.

లింగమూర్తి ముముక్షుజనహితమును, సంసారసాగరోత్తారకమును, తారకసాంఖ్యామనస్కాత్మకమును, జీవబ్రహ్మైక్య సాక్షాత్కారాసాధారణ కారణంబునైన రాజయోగంబంతయు నొక్క ప్రబంధంబుగా రచింపనెంచి పరమైకాంతంబున శ్రీ గురుమంత్ర దేవతా తత్త్వాను సంధానంబు సేయుచున్న సమయంబున మహాదేవ గురుమూర్తి స్వరూపుఁడైన శ్రీ రామచంద్రుఁ డాతనికి ప్రత్యక్షమై సర్వోపనిషత్సారభూతమైన జీవబ్రహ్మైక్య రహస్య ముపదేశించి "బ్రహ్మాండపురాణమునందలి యధ్యాత్మ రామాయణ ముమామహేశ్వర సంవాదమైయొప్పుచున్నది. అందు శ్రీ రామహృదయమను నితిహాసము సీతారామాంజనేయ సంవాదమను పేర ప్రవర్తిల్లుచున్నది. కాని యది మిక్కిలి సంక్షేపముగా నున్నది. అందలి యర్థమును విస్తరించి యొక్క ప్రబంధముగా రచి

యించి నాపేరనంకితము గావింపు''మని యానతిచ్చి తిరోహితుఁడయ్యెను. లింగమూర్తి మేల్కాంచి పరమానంద భరితాంతరంగుఁడై కావ్యరచనమున కుపక్రమించెను.

కైలాస పర్వతమున శంకరుఁడు దేవతలును, గణాధీశ్వరులును, సప్తమాతృకలును గొలుచుచుండ స్వస్వరూపావలోకనంబు సేయుచు నాత్మారాముఁడై యున్న సమయంబున పార్వతీదేవి యతనికి నానావిధ శుశ్రూషలు గావించి యారాధింప ప్రసన్నుఁడై నీకిష్ట మెయ్యది తెల్పు మిచ్చెద నని పలికెను. అంత పార్వతి :—

ప్రాణనాథ తనదుపతినిగొల్చుట కంటె
వేఱుపనులు గలవె చారుమతికిఁ
గాననీదు సేవ గావించుటయె కాని
యొండుకోర్కె లేదఖండమూర్తి !

అని పలికి ''మీ రభీష్టము నిచ్చెదరని పల్కితిరి గాన నాకును నెల్ల మానవులకును మేలు గలుగునట్లుగా నొకటి యడుగవలె నని యున్నది నిఖిల కలుష సంక్షయకరము, నఖిలాభీష్ట ప్రదము, ననంతావ్యయచిత్సుఖదము, జగదీశ్వర సాన్నిధ్యకరము నగు మంత్రరాజము నుపదేశింపు''మని వేడెను. శివుఁడు నవ్వి ''అడుగరాని రహస్యార్థము నడిగితివి. అయినను నెయ్యము కలిమిచే నీకది యెఱింగింతు''నని పలికి శ్రీ రామమూల మంత్రార్థము నుపదేశించి దాని మహిమానుభావములను వివరించెను. పార్వతి సంతోషించి ''స్వామీ ! శ్రీ రామమంత్రాధిదేవతా తత్త్వస్వరూపము నెఱిఁగింపుమని ప్రార్థించెను. శివుఁడు ''శ్రీరామ హృదయమను పరమేతిహాసము గలదు అందు శ్రీరామ తత్త్వము విశదముగాఁ జెప్పఁబడినది అతిరహస్య మగుటచే నది యెవ్వరికిని గోచరముగాదు. దానిని వివరించెద వినుము. శ్రీమన్నారాయణుఁడు లోకరక్షణార్థమై శ్రీ రామచంద్రుఁడుగా నవతరించి సీతను బెండ్లాడి పితృవాక్య పరిపాలనార్థమై తమ్మునితోడను, భార్యతోడను దండకారణ్యభూముల కరిగి, సకల రాక్షసగణమును సంహరించి, సీతను హరించిన రావణాసురుని పుత్త్రిభ్రాతృ బంధు యుక్తముగా వధించి, సీతాలక్ష్మణ సుగ్రీవ హనుమదాదులతోఁ గూడ పుష్పకముపై నయోధ్య కరుదెంచి. పట్టాభిషిక్తుఁడయ్యెను, అతఁడు హిత పురోహితామాత్యాదులకును, దాస దాసీ జనులకును, విభీషణ సుగ్రీవాదులకును

విచిత్ర వస్త్ర గంధ మాల్యాదులనొసంగి సత్కరించి నిటల తటఘటి తాంజలియై తన పురోభాగమున వర్తించు హనుమంతునిఁ గాంచి సీతతో నిత్యభక్తుఁడు, జ్ఞానాసక్తుఁడునైన నితనికి నాదివ్య తత్త్వస్వరూపము నుపదేశింపుమని పలికెను. సీత శ్రీరాముని పరబ్రహ్మత్వము నాంజనేయుని కెఱింగింప నాతఁడా సర్వమయుని గాంచు పరమ సూత్రము తన కెఱింగింపవలెనని యడిగెను. సీత నవ్వుచు,

ప్రత్యగాత్మ స్వరూపుఁడై పరఁగు తనకు
రమణ పరమాత్ముఁడైన శ్రీరామునకును
సమర సాన్యోన్య సంధాన సరణి యెద్ది?
యదియ యోగంబు సదుపాయ మాంజనేయ!

అని పలికి యాయోగము నిట్లు వివరించెను. "ఆయోగ మభ్యాసయోగము, జ్ఞానయోగము నని యిరుతెంగులు అటఁ దభ్యాస యోగము ప్రాణాయామమన విలసిల్లును అది ప్రాకృతము, వైకృతము, కేవలకుంభకము అని మూఁడు విధములు ప్రాకృతము మంత్రయోగము; వైకృతము లయయోగము; కేవలకుంభకము హఠయోగము. అభ్యాసయోగమున యమనియమాదులగు నష్టాంగములు గలవు. ఇది యపరిపక్వబుద్ధులకు యోగ్యము. అతిదుర్లభమైన యిది యణిమాద్యష్టైశ్వర్యముల నొసఁగుచు నాత్మజ్ఞానమును బ్రకటముగాఁజేయును. రెండవది యగు జ్ఞానయోగము పవిత్ర చిత్తులగు వారికి ప్రత్యగాత్మ పరమాత్మలకుఁగల యభేదము తెలుపఁజాలును. దీనికే రాజయోగమని పేరు. ఈ రెండు యోగములకును వైరాగ్య ప్రధానమగు శ్రీరామ పాదారవింద నిశ్చలభక్తియే హేతుభూతము. రాజయోగము నాశ్రయింపలేక పలువురు జనులు విమూఢులై సంసార సముద్రమున మునుఁగుచున్నారు. ఈ రాజయోగము ముక్తికి రాజమార్గము. ఇది తారకము, సాంఖ్యము, అమనస్కము అని మూడు విధములు.

తారకంబు మనశ్శుద్ధికారకంబు
సాంఖ్య మాత్మస్వరూప విచారకంబు
ననుభవజ్ఞాన మమనస్కము."

అని తెలిపి యామె హనుమంతునికి తారక యోగము నెఱింగించెను. తరువాత శ్రీరాముఁడే యతనికి స్వయముగా సాంఖ్యామనస్కయోగములను గూర్చి

వివరించెను. హనుమంతుఁడు సీతారాముల చరణములకు వందనము లాచరించుచు రామనామ సంకీర్తన మొనరించుచు నిజాశ్రమమున కరిగి నిర్వికల్ప సమాధినిష్ఠుఁడై జీవన్ముక్తి సౌఖ్యము ననుభవించుచుండెను.

అధ్యాత్మ రామాయణమున మొదటఁ గల శ్రీరామ హృదయమునకు సీతారామాంజనేయ సంవాదమను పేరు శివుఁడే పెట్టియుండెను.

అత్రతే కథయిష్యామి రహస్య మపిదుర్లభమ్
సీతారామ మరుత్సూను సంవాదం మోక్షసాధనమ్

అని శివుఁడు పార్వతితో చెప్పియుండెను. దానిని బట్టియే లింగమూర్తి తన గ్రంథమునకు సీతారామాంజనేయ సంవాదమని నామకరణము చేసియుండెను అధ్యాత్మ రామాయణమువలె సీతారామాంజనేయ సంవాదము కూడ గౌరీశంకర సంవాదముతోనే యారంభించుచున్నది అధ్యాత్మ రామాయణము పార్వతి శివుని శ్రీరామ తత్త్వమును గూర్చి చెప్పుమని తనంత తానే యడిగిన ట్లున్నది. సీతారామాంజనేయ సంవాదమున పార్వతి సేసిన శుశ్రూషకు మెచ్చి ప్రసన్నుఁడై శివుఁడు నీకెయ్యది యిష్ట మిచ్చెద నడుగుమని పలుక పార్వతి "సతికి పతిని గొలుచుటకంటె వేఱు పనులుకలవే? మీసేవ గావించుటకంటె వేఱు కోరిక నాకులేదు. అయినను నభీష్టమిచ్చెదనడుగు మని యానతిచ్చితిరి గావున సకలమానవులకును మేలు కలుగునట్లుగా సకలపాపక్షయకరము, సర్వాభీష్టప్రదము నగు శ్రీరామ మంత్రరాజము చెప్పుఁ"డని యడిగిన ట్లున్నది. ఈ సందర్భమున లింగమూర్తి అధ్యాత్మ రామాయణము నందలి కథన విధానము నించుక మార్చి పార్వతీదేవియందు నాదర్శపతి వ్రతాలక్షణములను, నాదర్శ శిష్యలక్షణములను బ్రదర్శించెను. పతివ్రత భర్త నేమియు నడుగనట్లే యుత్తమ శిష్యుఁడును సద్గురుని సేవించుచు నాతని హృదయమునకుఁ బ్రీతిఁ గలిగించును. ఉత్తమ సతికి కావలసిన వన్నియు భర్తయే సమకూర్చున ట్లుత్తమ శిష్యున కుపదేశింపవలసిన దంతయు గురుఁడే యుపదేశించును లింగమూర్తి పార్వతి పాత్రమున కిచ్చట వన్నె గలిగించెను. అధ్యాత్మ రామాయణమున పార్వతి శ్రీరామ తత్త్వమును గూర్చి యేదో సంశయ మున్నట్లు తెలిపి దానిని తొలఁగింపుమని శివుని ప్రార్థించినట్లు గలదు. సీతారామాంజనేయ సంవాదమున పార్వతి ప్రశ్నలోకహితాకాంక్షిగను, జిజ్ఞాసాత్మగను గన్పించుచున్నది. సీతారామాంజ

నేయ సంవాదమున రావణవధానంతరము జరిగిన శ్రీరామ పట్టాభిషేకము వఱకును గల కథ సంగ్రహముగా నాలుగు పద్యములలోఁ జెప్పఁబడినది. ఇది యధ్యాత్మ రామాయణమున లేదు. తరువాత శ్రీరాముని యాజ్ఞచే సీత హనుమంతునికి రామ తత్త్వ ముపదేశించుట యధ్యాత్మ రామాయణము నందును, సీతా రామాంజనేయ సంవాదమునందును సమానమే. సీతారామాంజనేయ సంవాదమున సీత తెల్పిన శ్రీరామ తత్త్వమును విని హనుమంతుఁడే "మహా సర్వమయుని సులభముగాఁ గాంచు పరమ సూత్ర మెద్ది? నాకెఱింగింపవమ్మ !" యని ప్రార్థించెను. అపుడు సీతాదేవి యభ్యాసయోగమును గూర్చియు, సాంఖ్యామనస్కతారక రూపమగు రాజయోగమును గూర్చియు సంగ్రహముగా తెలిపి రాజయోగమందలి మొదటి భేదమైన తారకమును వివరించెను. అధ్యాత్మ రామాయణమున సీత రామునాజ్ఞ ననుసరించి హనుమంతునికి శ్రీరామ తత్త్వమును, తన తత్త్వమును గూడ తెలిపెను. హనుమంతుని కది సమగ్రముగా బోధపడలేదని గ్రహించి కాఁబోలు శ్రీరాముఁడాత్మ తత్త్వమునే మఱింత వివరముగా బోధించినట్లున్నది. సీతారామాంజనేయ సంవాదమున తృతీయాశ్వాసారంభమునందు రాముఁడు హనుమంతుని "సీతచెప్పిన తారకయోగమంతయు తెలిసెనుగదా !" యని యడిగి యపారకరుణచే నాతఁ డడుగకయే యాతనికి సాంఖ్యయోగమును గూర్చి చెప్పనారంభించెను. సాంఖ్యయోగమును గూర్చి విన్నపిమ్మట హనుమంతుఁడు తద్యోగానుభవమును బొంది గురువైన శ్రీరామచంద్రుని స్తుతించి యట్టి యనుభవము తనకు నిత్యముగానుండున ట్లనుగ్రహింపు మని ప్రార్థించెను. శ్రీరాముఁ డప్పు డాతని స్థితికి తగిన యమనస్కయోగము నుపదేశించెను.

లింగమూర్తి గురూపదేశము ననుసరించి యధ్యాత్మ రామాయణమున సంక్షేపముగానున్న విషయములను విస్తరించి వ్రాసెను. ఈ విస్తరణమునకై యతఁ డాధ్యాత్మిక వస్తుమయములైన యనేక గ్రంథములను బరిశీలించెను. ఆ గ్రంథములలో ముక్తికోపనిషత్తు, రామరహస్యోపనిషత్తు, రామతాపన్యుపనిషత్తు, నాదబిందూపనిషత్తు, వివేకచూడామణి, భగవద్గీత, వేదాంత పంచదశి, అపరోక్షానుభూతి మున్నగు గ్రంథములు ముఖ్యములైనవి. అతఁడా గ్రంథముల నుండి పెక్కు విషయములను గ్రహించి సొంతమాటలతో లలితమధురము నిర్దుష్టమునైన శైలిలో సవిస్తరముగను, నసందిగ్ధముగను వివరించియుండెను.

ప్రథమాశ్వాసమున సీత హనుమంతుని కుపదేశించిన రామతత్త్వ మధ్యాత్మ రామాయణమందలి బాలకాండ ప్రథమ సర్గమునుండి గ్రహింపఁబడినది ఇంక భగవద్గీత శ్లోకముల కనువాదములని చెప్పఁదగిన పద్యములు సీతారామాంజనేయ సంవాదమున ననేకము లున్నవి.

వనరుచు నేమియుం దిననివానికి మిక్కిలి వెక్కసంబుగాఁ
దిని యెగఁబోయువానికినిఁ దీఱని నిద్దుర నెల్లప్రొద్దుఁబై
కొనఁ బడియుండువానికినిఁ గొంకక రేపగలొక్కరీతి మే
ల్కొని వసియించువానికి నగోచరము ల్వర యోగలక్ష్యముల్.

అను పద్యము భగవద్గీతయందలి యాఱవ యధ్యాయము నందలి 16, 17 శ్లోకముల కనువాదప్రాయము. మూఁడవ యాశ్వాసమున స్థితప్రజ్ఞ లక్షణములను వివరించు పద్యములన్నియు భవద్గీత రెండవ యధ్యాయమునందలి శ్లోకముల ననుసరించుచున్నవి. ఇవియేకాక భగవద్గీతా శ్లోకముల కనుకరణములని చెప్పఁతగిన పద్యములింకను బెక్కులుగలవు. ఇట్లే లింగమూర్తి యాయా సందర్భములయందు శంకర భగవత్పాదుల వివేకచూడామణి యందలి శ్లోకములను, కొన్ని యుపనిషద్భాగములను జక్కఁగా ననువదించియుండెను.

లింగమూర్తి వేదాంత శాస్త్రములనే యే గురువుల యొద్ద నభ్యసించెనో చెప్పుట కవకాశములేదు. కాని సీతారామాంజనేయ సంవాదమును జూడ నతని పాండిత్యము వేదాంత విషయమునను, సాహిత్య విషయమునను నపారమును, సర్వతో ముఖమును నై నట్లు కన్పించును. అతఁడు వేదాంత వాఙ్మయశిరోభూషణములని చెప్పఁదగిన యుపనిషత్తులను, బ్రహ్మసూత్ర తద్భాష్యములను, భగవద్గీతాదులను క్షుణ్ణముగా పఠించి యందలి విషయముల ననుభవమునకుఁ దెచ్చుకొని యుండుటేకాక యోగ శాస్త్రమునందును, యోగ సాధనమునందును నారి తేరి యుండెననికూడఁ జెప్పవచ్చును తృతీయాశ్వాసమున హనుమంతుఁడు గురువైన శ్రీరాముని పరబ్రహ్మమూర్తిగా వర్ణించియుండెను. ఈ వర్ణనమైన పిమ్మట లింగమూర్తియే "యి ట్లఖండ పాండిత్యముచేత పెక్కు భంగుల వినుతించు హనుమంతుని" శ్రీరాముఁడు సాదరముగను సానుగ్రహముగను, కనుంగొనినట్లు చెప్పియుండెను. ఇందలి యఖండ పాండిత్యము హనుమంతునిదికాక లింగమూర్తిదే. ఏలయన నాస్తోత్రమును లింగమూర్తియే హనుమంతుఁడు చేసినట్లు రచించియుండెను.

లింగమూర్తి యధ్యాత్మ విషయ ప్రధానమైన ప్రబంధమునే రచింపఁ బూనినను సహజ కవితాకౌశలముగల వాఁడగుటచే క్లిష్టములైన విషయములను గూడ లలితముగను, సుందరముగను, సరసముగను వివరించియుండెను. అతఁ డధ్యాత్మజ్ఞానమను దివ్యౌషధమును పఠితలానందముగా గ్రహించుటకై దానికి కవితామధువు ననుపానముగా జత సేసియుండెను. అందుచేతనే యతని గ్రంథము చదువుచున్నపుడు పఠితల హృదయములకు నేవిధమైన క్లేశమును గలాగదు భావ ప్రకటనమునందును, విషయవ్యక్తీకరణమునందును, ఉపమానాదుల వాడుటయందును, శబ్దప్రయోగమునందును అతఁడు చూపునేర్పన న్యసామాన్యమైనట్టిది అతనివలె కేవలాధ్యాత్మవిషయ ప్రధానములైన గ్రంథములను గూడ కవితామయముగా వించిన వారెందఱో యుండరు !

సీతారామాంజనేయ సంవాదమును లింగమూర్తి శ్రీ జానకీరామ బ్రహ్మస్తోత్ర రూపమైన యీ పద్యముతో నారంభించెను :—

శ్రీమద్దివ్యనిజాంఘ్రి పద్మములు సంసేవింపుచున్ భక్తిచే
ధీమంతుండగు నాంజనేయుని నసద్దేహేంద్రియాతీతచి
ద్భూమానందుఁడ వీవ నేనని కృపనోప్పదించు శ్రీజానకీ
రామబ్రహ్మము నంతరంగమున నారాధింతు నశ్రాంతమున్

ఇందు వస్తు నిర్దేశము చక్కఁగాఁ జేయఁబడినది సీతారామాంజనేయ సంవాద గ్రంథమునందలి పరమార్థము జీవబ్రహ్మైక్య రూపమగు నద్వైతమును బోధించుట. ఇందు శ్రీరాముఁ డాంజనేయునికి నసద్దేహేంద్రియాతీత చిద్భూమానందుడవైన నీవే నేనని బోధించియుండెను. శ్రీరాముఁడు బ్రహ్మస్వరూపుఁడు. గ్రంథమునఁ గూడ నీ విషయము విస్పష్టము చేయఁబడినది గురుపాదములను సేవించుట భక్తి గలిగియుండుట, ధీమత్త శిష్యునికుండ వలసిన ప్రధాన లక్షణములు. అవియున్న శిష్యుఁడు గుర్వనుగ్రహమునకు తప్పక పాత్రుఁడగును. ఈ పద్యమున హనుమంతుని యందామూఁడు లక్షణములును వర్ణింపఁబడినది. అందుచేతనే యతఁడు గురుకటాక్షమునకు పాత్రుఁడై యద్వైత బోధామృతము నాస్వాదింపఁగలిగెను "ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాపితన్ముఖ"మ్మను లాక్షణికోక్తి ననుసరించి యీయారంభ పద్యమున వస్తునిర్దేశమే గాక నమస్కారము గూడ గోచరించుచున్నది. రెండవ

పద్యము సీతాస్తుతి పూర్వకమైనది. ' రామాంకమున నజస్రము వసించు రామ''
యనఁగా పరబ్రహ్మముతో నేకమైన పరాశక్తి యని భావము. ఇందు సీత మూల
ప్రకృతిగాఁ జెప్పఁబడినది. మూఁడవ పద్యమున సాక్షాత్పర మాత్మమయులును,
భాషావధూ ప్రసన్న మంగళ దేవతా సర్వమంగళాధి పతులునునైన బ్రహ్మ
విష్ణుమహేశ్వరుల స్తుతి చేయఁబడినది. ఇందు త్రిమూర్తులు సాక్షాత్పరమాత్మ
మయులని చెప్పఁబడుటవలన పరమాత్మ కంటె భిన్నులు కారను భావము ప్రక
టింపఁబడినది, నాల్గవ పద్యమున బ్రహ్మాత్మైక్య వివేకము నిచ్చు బ్రాహ్మీ
మంగళ దేవతాగిరిజల ప్రార్థనమున్నది. ఈ మువ్వురును త్రిమూర్తులకు సృష్టి
స్థితి లయముల నొనరించు సామర్థ్యము నొదలించుచున్నారు. ఈ పద్యము
''శివశ్శక్త్యాయుక్తః యది భవతి శక్తః ప్రభవితుమ్'' అను నాచార్యస్వాములవారి
సౌందర్యలహరి ప్రథమ శ్లోకమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది తరువాత గణపతి
ప్రార్థనమున్నది ఇతఁ డిందు స్థావర జంగమాత్మక ప్రపంచోత్పత్తికి కారణ
భూతుఁడనియు, పరమపురుషుఁడనియు, మూల ప్రకృతి స్వరూపుఁడనియు,
తదధిష్ఠాన భూతుఁడగు పరబ్రహ్మమనియు వర్ణింపఁబడియున్నాఁడు. తరువాత
గ్రంథమున చెప్పఁదలఁచిన తత్త్వజ్ఞాన మెవ్వరికి తొలుత నుపదేశింపఁబడి
నదో యాయుత్తమాధికారి యగు హనుమంతుని స్తోత్రమున్నది పిమ్మట
నారాయణ గురువును మహాదేవగురుని కవిస్తుతించియున్నాఁడు. కవికిఁగల
గురుభక్తి యపారమైనట్టిది. మహాదేవ గురుని నెంత వర్ణించినను అతనికి
తనివిదీరన ట్లనిపించును కలలోఁగనిపించిన యతని వర్ణించునపుడు
''శ్రీ మహాదేవ గురుఁడైన రామవిభుఁడ''ని యతనికిని రామునికిని అతఁ
డభేదాధ్యవసాయము గల్పించెను లింగమూర్తి సంస్కృత కవులలో వాల్మీకి
వ్యాస మయూరబాణ కాళిదాసులను, నాంధ్ర కవులలోనన్నయ, తిక్కన్న
సోమనాథ భాస్కర పోతనాదులను స్తుతించి యుండెను. అతఁ డెందుచేతనో
యెఱ్ఱాప్రెగ్గడను విడిచిపైచెను. ''మున్ను ప్రసిద్ధిగాంచు కవిముఖ్యుల''లో
నతఁడు గూడ నంతర్గతుఁడై యుండును. గురు పరంపరను వర్ణించిన పిమ్మట
నతఁడు షష్ఠ్యంతములందు మహాదేవుని గుణగణములను వర్ణించెను తృతీయా
శ్వాసమున గురువును గూర్చి వివరించుచు :—

గురుఁడ జుఁడు గురుఁడు విష్ణుఁడు
గురుఁడు మహాదేవుఁ డఖిల గురుఁడు గురుఁడు

ద్గురుఁడె పరబ్రహ్మంబని
గురుని నుపాసించునతఁడు గురుతరభక్తిన్

అను పద్యమును వ్రాసెను. దీనినతఁడు గురు ర్బ్రహ్మ గురుర్విష్ణుః" అను శ్లోకము ననుసరించియే వ్రాసినను మహేశ్వరపదమునకు బదులు మహాదేవ పదమును వాడుట తనకు గురువునెడఁగల భక్తిని సూచించుటకే. అతని దృష్టిలో మహేశ్వరునకు మహాదేవ గురునకు నభేదము.

సీతారామాంజనేయమున మొందటనుండి తుదివఱకు తారక సాంఖ్యామనస్కయోగములే వివరింపఁబడి యుండుటచే నిందలి ప్రధానరసము శాంతమే యని చెప్పవచ్చును అంతకు భిన్నమైన కథా సంవిధానము లేని కారణమున నిందు నన్యరసముల ప్రసక్తియే లేకపోయినది. ఇందుఁగల పాత్రములు మూఁడే. శ్రీరాముఁడు, సీత. ఆంజనేయుఁడు. ఇందు శ్రీరాముఁడు పరబ్రహ్మ స్వరూపుఁడుగా వర్ణింపఁబడియున్నాఁడు.

తెలియఁబడుచున్న విశ్వంబు దృశ్యమంచు
తెలివినై సర్వమునుగాంచు దృక్కునేను
మిగుల నాకంటె నన్యమేమియునులేదు
సత్యమిది సర్వవేదాంత సంగ్రహంబు (2-98)

అట్టి పరిపూర్ణ తత్త్వమైనట్టి నేను
బూర్వకల్పాంతమున నీయపూర్వవిశ్వ
జననమునకంటె మును నిరంజనుఁడనగుచు
నద్వయుఁడనై వెలుంగుదు నాంజనేయ ! (2-18)

అని శ్రీరాముఁడే తన్ను గూర్చి యాంజనేయునితో చెప్పియుండెను. సీత మూల ప్రకృతి స్వరూపిణి.

త్రిగుణాత్మికయై యనిశము
జగములఁబుట్టింపఁబెంప సమయింపంగాఁ
దగుమూల ప్రకృతియేనే
నగుదుఁజుమీ సత్యముగ మహాగుణశాలీ ! (1-39)

అను పద్యమువలననీ విషయము స్పష్టమగుచున్నది. పరబ్రహ్మ సాన్నిధ్యము వలన నామె జాగరూకయై జగములు సృష్టించుచుండును. అజ్ఞానులచే నా సృష్టియసంగుఁడైన శ్రీరామ శుద్ధబ్రహ్మమునం దారోపింపఁబడుచుండును. శ్రీరాముఁడవతరించి చేసిన కార్యములన్నియు నామెచే చేయఁబడినట్టివే లింగమూర్తి కావ్యారంభమున సీతపాతివ్రత్యమును తరువాత శిష్యవాత్సల్యమును చక్కఁగా వర్ణించియుండెను. మున్ను దండకారణ్యమున రాముఁడు తాపసవేషధారియై బ్రహ్మర్షిలోక సభామధ్యమునఁ గూర్చుండియుండఁగా మునికన్యకలాతని జూడఁగోరి సీతను ముందిడుకొని యచటికేఁగి యొక్కొక్క మునినే చూపుచు "నీ భర్త యితఁడా ! యతఁడా' యని సీతను ప్రశ్నించిరి. సీతవారినందఱిని "కాఁడు కాఁ"డని శిరశ్చలనముచే నిషేధించి రామునిఁగాంచినపు "డవుగాఁడనక" యూరకుండెను. అది చూచి మునికన్యక లెల్లరును సంతసించిరి. ఇచట ఋషులనడుమ ఋషివేషముతోనున్న శ్రీరామునకును. జీవులనడుమ నాభాసుఁడై యున్న పరబ్రహ్మమునకును, వైరాగ్య వివేకయుక్తియగు ధీవృత్తికిని, పతిభక్తియుక్తయగు సీతకును పోలిక చెప్పఁబడినది. సీత దృఢమైన భక్తియు, వివేకమును గలది కావుననే ఋషులయందు పతిభావము నిషేధించి రామునిఁ జూచి యూరకుండినది ఆంజనేయుఁడిందు పరమ భక్తియుక్తుడును, ధీమంతుఁడును, జిజ్ఞాసువునైన శిష్యవరేణ్యుఁడుగా చిత్రింపఁబడియున్నాఁడు. అందుచేతనే యతఁడు గురువులైన సీతారామాచార్యుల యనుగ్రహమున రాజయోగానుభవమునంది జీవన్ముక్తుఁడు గాఁజాలెను.

లింగమూర్తి కైలాస పర్వతవర్ణనముతో కథారంభము గావించెను.

శ్రీసుఖదశుద్ధ సత్త్వ
వాసము శివపార్వతీనివాసము సుమహో
భాస మ నాభాసముగై
లాసము దనరారుఁ జిద్విలాసంబగుచున్ (1-40)

అని యతఁడు కైలాసము చిద్విలాసమై తనరారుచుండెనని వర్ణించెను. తరువాతి దీర్ఘమైన వచనమున నా పర్వతరాజమును గ్రంథ ప్రతిపాద్య పరబ్రహ్మ స్వరూపముగా నిరూపించి యుండెను. ఇందతఁడు వాడిన విశేషణములన్నియు శ్లేషసామర్థ్యమున నా రెండింటికి నన్వయించును. ఈ వర్ణనము పాండిత్యస్ఫో

రకమై లింగమూర్తి భావనాశక్తిని ప్రకటించుచున్నది. ప్రబంధకవులు సాధారణముగా తమ గ్రంథములను బురవర్ణనముతో నారంభింతురు. ఇతఁడట్లుగాక తన గ్రంథమును పవిత్రమైన కైలాస పర్వత వర్ణనముతో నారంభించెను. శివుఁడు పార్వతితో శ్రీరామ నామ ప్రభావము నెఱింగించుచు.

బ్రహ్మహత్యాఖ్య పాపతమోర్క బింబంబు
    మధుపానదోషాభ్ర మారుతంబు
తపనీయచౌర్య పాతకశైలభిదురంబు
    గురువధూగమ నాఘకుంజరహరి
జననీపితృభ్రాతృవని తార్భకాచార్య
    గోవధారణ్యోరుదావవహ్ని
పరసతీ సంగమ పరధనహరణాది
    ఘోరపంకోరగ క్రూరబర్హి
యనృతభాషణవల్లి మహాలవిత్ర
మార్యదూషణ పంకేరుహద్విపేంద్ర
మఖిల కలుషాంబునిధి బడబానలంబు
రామనామంబు హిమశైలరాజతనయ ! (1-53)

అబల ! శ్రీరామ రామ రామాఖ్యమన్త్రి
మీప్సితంబుల నర్థుల కిచ్చుచుండఁ
గాంచి నెఱి సిగ్గుపడుచుండుఁ గల్పతరువు
కామధేనువు నలఘుచింతామణియును (1-61)

మున్నగు పద్యములలో దాని యద్వితీయ ప్రభావము విశదముగా వర్ణించి యుండెను. సీత హనుమంతునకు తారకయోగము వివరించుచు ఖేచర్యాది పంచ ముద్రలను, గురూపదేశమూలముగా నెఱుంగవలసిన దశవిధనాదములను వర్ణించి యుండెను. ఈ నాదములు మొదట చిణియను శబ్దముగను, పిదప చిణి చిణి యను శబ్దముగను, తరువాత క్రమముగా ఘంటాశంఖ వీణాతాళవేణు భేరీ మృదంగ మేఘనాదములవలెను వినిపించును. అందు ఘంటానాద రూపమైన ప్రణవ స్వరమును లింగమూర్తి యిట్లు వర్ణించెను.

కంటిన్ నెమ్మదిఁ గంటి సద్గురుని నింకన్ మేనిలో పువ్వులా
జింటన్ బూజ లొనర్తు సంచుఁ గర మర్థిన్ దేహి దా మున్నుగా
ఘంటానాదముఁ జేసెనో యనఁగనోంకారంబు హృద్వీథియన్
మింటన్ మ్రోయుఁ దదారవంబుగతి యామీఁదన్ విజృంభించుచున్ (1-121)

వీణానాదమువలె నిన్పించు ప్రణవస్వర మిట్లు వర్ణింబఁబడినది :—

నలు వొప్పం దగు బ్రహ్మదండి నొక వీణాదండముం జేసి, ష
డ్జలజాతంబుల మెట్లుగానిలిపి, పంచప్రాముల్ తంత్రులై
యలరంగాఁగొని, ముక్తి కామిని సహస్రారంబునం దుండి ని
చ్చలు వాయించె ననంగ నొప్పుఁ బ్రణవస్వానంబు దా నంతటన్ (1-123)

లింగమూర్తి గ్రంథపఠనముచేఁగలిగిన జ్ఞానమును బురస్కరించుకొనికాక యనుభవ పూర్వకముగానీ వర్ణనములను గావించెననుటకు పై పద్యమందలి రచనా విధానమే తార్కాణము.

గురూపదిష్ట మార్గమున కన్నులుమూసి యంతర్దృష్టి సారించినచో చిత్కళలు గానవచ్చును. చిదాకాశ దర్శనమే చిత్కళా దర్శనము. లింగమూర్తి యీ చిత్కళల యాకారములను, రంగులను, కాంతులను చక్కఁగా వర్ణించి యుండెను.

మందాకినీ సుధాసందోహదుగ్ధాబ్ధి
సౌందర్యలహరుల చందమునను
మందార మల్లికాకుందారవిందోరు,
చందనపుష్ప రుక్చయము పగిది
నిందిరాసుందరీ మందిరాత్మక మక
రంద నిర్ఝర రుచిప్రతతి రీతి
నిందుభృన్నంది సంక్రందన కరిమృగేం
ద్రఫణీంద్రదీప్తి బృందముల భాతి
హారనీహారడిండీర శారదాభ్ర
హీరకర్పూర తారకాకార కాంతి
కరణి నాకాశ పంచకాంతరమునందు
మండితములగుఁ జిత్కళామండలములు (1-141)

ఇం దాకాశపంచకాంతర స్థితములైన చిత్కళామండలముల ధావళ్య మనే కోపమానములచే రమ్యముగా నిరూపింపఁబడినది. తరువాతి పద్యమున చిత్కళలకాంతి వైవిధ్యము నిరూపింపఁబడినది. పిమ్మట హిరణ్మయ మండల మీ క్రింది పద్యమున మిక్కిలి విశదముగా వర్ణింపఁబడినది :—

మహనీయవైశాఖ మధ్యాహ్నకాలసం
కలితమార్తాండ మండలము పగిదిఁ
జారునిర్మల శరత్సమయరాకాసము
జ్జ్వల పూర్ణ చంద్రమండలము పగిదిఁ
దప్తహేమాభిదీప్తజ్వాలికాజాల
విలయకాలాగ్ని మండలమురీతి
నీలతోయదమధ్య నిర్గతకమనీయ
వితతసౌదామినీలతిక భాతిఁ

బరఁగి నీవారశూకంబు కరణిసూక్ష్మ
మై విమలమై యవర్ణమై యప్రమేయ
మై యచింత్యప్రకాశమై యలరుచుండుఁ
జండరుచుల హిరణ్మయమండలంబు (1-156)

ఈ హిరణ్మయమండలమే భ్రూమధ్యమున దీర్ఘకాలము నిల్చియుండు నాపోజ్యోతి యనఁబడు చిత్కళ. "నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవభాస్వరా, నీవారశూకవత్తన్వీ" యను వేదమంత్రము నందలి యర్థమే యీ పద్యమున ననుసరింపఁబడినది. ఇట్లే స్థూల శరీరమునందలి డెబ్బదిరెండువేల నాడులలో ముఖ్యమైన వానిని స్వరూపస్థానములతోఁ గూడ లింగమూర్తి విశదముగా వర్ణించి యుండెను. పిమ్మట లింగమూర్తి మోక్షసాధనమైన హంసమంత్రధ్యాన విధానమును, నాదబిందు సంయోగమును ననుభవ పూర్వకముగా వర్ణించి యుండెను.

ద్వితీయాశ్వాసమున లింగమూర్తి సాంఖ్యయోగాభ్యాసముచే పొందఁదగిన పరమ పరిపూర్ణ నిర్గుణ బ్రహ్మమును, "ఏకమై, పరమై, విశోకమై, సత్య మలోకమై, వ్యాపకాలోకమగుచు" నను పద్యమున చక్కఁగా వర్ణించి యున్నాఁడు. తరువాతి పద్యములలో నతఁడు సర్వసాక్షి స్వరూపుని లక్షణములు

వివరించి, యతఁడే పరమేశ్వరుఁడని నిరూపించియున్నాఁడు. మాయాశక్తి యస్తిత్వ నాస్తిత్వములు నిర్ణయించుట దుష్కరమని యాతఁడు సోపపత్తికముగా తెలిపియున్నాఁడు. మాయయు తదాలంబనమగు బ్రహ్మమును మాయా ప్రతిఫలితమగు చైతన్యమును కలియగా వానిలో మాయయందు ప్రతిబింబించిన బ్రహ్మచైతన్య మీశ్వరుఁడగును. బ్రహ్మస్వరూపుఁడై యున్నపుడతనికి మాయా సంబంధముండదు. శ్రీరాముఁడా యీశ్వరుఁడు తానేయనియు, సీతా వధూటి మాయయనియు, తాను మాయగలవాఁడయ్యు వశీకృతమాయుఁడై వర్తించుచుండుననియు నాంజనేయునకుఁదెలిపెను. తరువాత నతఁడు జీవేశ్వరైక్యమును తేటతెల్లముగావించెను.

పరగ శరావకుంభక నామరూపముల్
    ద్రోచి మన్నొకటిగాఁ జూచుపగిది
ఘటతటాకముల నొక్కట నిషేధించిత
    ద్గతజల మొకటిగాఁగాంచు కరణి
దీపప్రదీప వర్తియుగమ్మడంచిత
    త్తేజంబు నొకటిగాఁదెలియు భాతిఁ
గలశగృహంబులఁ గడనుంచిదానిలోఁ
    గలమింటి నొకటిగాఁదలఁచు రీతి
బాధ్య జీవేశ్వర త్రయోపాధియుగముఁ
బ్రాకట వివేకదృష్టి నిరాకరించి
తనరు పరిపూర్ణ శుద్ధచైతన్య మొకటి
గావిలోకింపవలయు మేధావియనఘ ! (2-60)

భిన్నరూపములైన భూషణముల కాధారమైన బంగార మొక్కటియేయైనట్లు భిన్నములైన యుపాధులకు మూలాధిష్ఠానమైన దొక్క పరబ్రహ్మయే. ఇదే "తత్త్వమసి" మహావాక్యము యొక్క యర్థము. లింగమూర్తి యీ మహావాక్యార్థమును జహదజహల్లక్షణచే నెఱుఁగవలసిన విధమును వివిధములైన దృష్టాంతములచే నుపదేశించి యున్నాఁడు. ఇట్లే యాతఁడు దృక్‌దృశ్య వివేకమును గూడ వివరించి యున్నాఁడు.

శ్రీరాముఁడు చెప్పిన సాంఖ్యయోగమును విని హనుమంతుఁ డతనిని స్వస్వరూపునిగా ధ్యానించుటకు తగిన దేశకాలనియ మాదులెట్టివో యుపదేశింపుమని వేడ రాముఁడు పరమాత్మ ప్రత్యగభిన్న పూర్ణచైతన్యమని తెలిసిన వానికి దేశకాలాది నియమములు లేవని యెఱింగించెను. పిమ్మట సాధకుని లక్షణములను, నాత్మ సచ్చిదానంద స్వరూపలక్షణములను, ప్రపంచ ప్రళయ ప్రకారమును వివరింపఁబడినవి. చివరికి శ్రీరాముఁడు హనుమంతుని శిరమను పూర్వాద్రిశిఖరముపై స్వకరార్కమండలమును జేర్చి "యీహస్తమస్తక సంయోగముచేనే విజ్ఞానము తెలియఁబడుచున్నదో యావిజ్ఞానమే నీవైతి"వని పలికి హనుమంతుని యంతఃకరణమందున్న యంతములేని యవిద్యాంధ కారమును బాపి, కేవల తత్త్వరూపమును దెలిపెను. ఈ హస్తమస్తక సంయోగ పూర్వక స్వాత్మానుభూతి ప్రదానము వేఁగినాటి కొండనార్యుని వివేకసింధువు నందుఁ గూడ కనిపించుచున్నది.

తృతీయాశ్వాసారంభమున హనుమంతుఁడు బ్రహ్మానంద భరితాంతఃకరణుఁడై శ్రీరామునికి సాష్టాంగ నమస్కారము గావించి యొకదండకముతోడను, వివిధవృత్తములతోడను శ్రీరాముని విశ్వమయునిగా వర్ణించియున్నాఁడు. ఈ వర్ణన మఖండ పాండిత్యమయమై లింగమూర్తి పరబ్రహ్మ జ్ఞానపారమ్యమును సూచించుచున్నది. శ్రీరాముఁడంత నాంజనేయుని కరుణాకటాక్షముల వీక్షించి యపరిపక్వచిత్తుల కసాధ్యమైన యమనస్కయోగమును వివరించెను. తారక సాంఖ్యయోగములకంటె నమనస్కయోగమునకుఁగల విశిష్టతను లింగమూర్తి యీ క్రింది పద్యమున దృష్టాంత పూర్వకముగా వివరించెను.

పాలు చాలఁగఁ గ్రోలఁజాలునే తగ నాల
    పొదుగులఁ బిఱుదులు పొదలు చున్న
లోపలిరస మాన నోపునే యిలఁ గోఁతి
    నారికేళఫలంబుఁ జేరికన్న
సొంపార రతులచే సుఖియింప నేర్చునే
    షండుండు మఱిరంభసరసనున్నఁ
దనమోము సొగసుగన్గొనునె పుట్టంధుండు
    మించుటద్దంబు చేనుంచుకొన్నఁ

గలుగునే నిత్యనిర్మలా ఖండసుఖము
లలఘు తారక సాంఖ్యయోగాశ్రితులకుఁ
దత్తదుచితోరుధర్మలబ్ధతలపగిది
విలసదమనస్కయోగాప్తి వలనఁగాక (3-43)

ఇందలి దృష్టాంతములు లింగమూర్తి లోకానుభవ పరిశీలనమును దేటతెల్లము గావించుచున్నవి. తృతీయాశ్వాసమున వైరాగ్యబోధోపరతుల కారణములు, స్వరూపములు, ఫలితములు, స్థితప్రజ్ఞలక్షణములు, "అహంబ్రహ్మాస్మి" యను మహావాక్యము యొక్క నర్థమును జక్కఁగా వివరింపఁబడినవి. లింగమూర్తి స్థితప్రజ్ఞుని లక్షణములను భగవద్గీత ననుసరించియే వర్ణించెను. యోగియైనవాఁడు నామరూపాత్మక ప్రపంచము పరబ్రహ్మమే కాని మఱియొకటి గాదని యెఱింగినను శరీరాదులచే ప్రారబ్ధము ననుభవించుచునే యుండును. అయ్యునతఁడు భ్రాంతినొందక యాత్మానాత్మ విచారముగావించి సకల ప్రపంచమును బ్రహ్మమయముగనే కనుఁగొనుచుండును. అట్టివాని స్థితిని లింగమూర్తి యీ క్రింది పద్యమున వర్ణించెను.

గానంబున్నటనంబుఁదాళగతులం గావించుచుం జారువి
ద్యానైపుణ్యముఁజూపుచున్, శిరముమీఁదం గల్గుపెందొంతరం
బూనంగైకొను నాట్యశీలునిగతిన్ బుంఖానుపుంఖోజ్జ్వల
స్నానార్థానుభవజ్ఞుఁ డయ్యు బుధుఁ డానందాత్ముఁ గాంచున్మదిన్ (3-101)

చిత్తోపరతిగల పురుషుఁడు బాలోన్మత్త పిశాచనిభుఁడై నిరింద్రియుఁడై సుప్తునివలె జగత్తును మఱచియుండును. అట్టివాని స్థితిని లింగమూర్తి యీ క్రింది రెండు పద్యములలో వర్ణించి యుండెను :—

గాలిందూలిన వానచేఁదడిసినన్ గాఢాగ్నిచేఁగాలినన్
వ్యాళంబాత్మ విముక్తకంచుకముపై వ్యామోహముందాల్పన
ట్లాలోలాంగముపై నిరూఢమమతాహంకారముల్లేకయా
త్మాలోకస్థితినుండు పండితుఁడు నిత్యానందముం బొందుచున్ (3-168)

మదిరాపానమదాంధుఁ డాత్మపటముల్ మైనుండినన్ జాఱినన్
వదులై వ్రేలినఁ జూడఁదప్పగిది జీవన్ముక్తుఁ డుద్యత్సమా

ధిదశాప్రాప్తసుఖామృతాను భవతృప్తిన్ మత్తుఁడై మేనునె
మ్మదిఁ గూర్చుండిన లేచినన్ నడచినన్ మన్నింపఁ డేనంచుఁ దాన్ (3-169)

కార్యకారణరూపమైన మనస్సు లేక పోవుటయే యమనస్కయోగము. అధిష్ఠానములైన రజ్జ్వాదులను చూచిన పిమ్మట నారోపితములైన భుజంగాదులు కన్పడని భంగి అధిష్ఠానమైన పూర్ణతత్త్వమునుగన్న పిమ్మట నారోపితమైన మనస్సదృశ్యమగునని లింగమూర్తి యీ క్రింది పద్యమున చక్కఁగా నిరూపించి యున్నాఁడు :—

ఆరోపితభుజంగ మమరఁగన్పట్టునే
    స్ఫురదధిష్ఠానరజ్జువును గనిన
నారోపిత మనుష్యుఁడలరఁజూపట్టునే
    భువినధిష్ఠానదారువును గనిన
నారోపితోదకంబరయంగఁదోఁచునే
    కనదధిష్ఠానార్కకరముఁ గనిన
నారోపితాచ్ఛరౌప్యము లక్ష్యమగునెయ
    ధిష్ఠానమైన శుక్తికను గనినఁ
దలఁప నారోపితాసితత్వంబుమరలఁ
గాననగునె యధిష్ఠానఖంబుఁ గనిన
దెలియ నారోపితమనంబు దృశ్యమగునె
తగ నధిష్ఠానపూర్ణ తత్త్వమును గనిన (3-51)

ఈ విధముగా లింగమూర్తి వర్ణ్యమేదైనను దానిని పఠితల మనస్సునకు సాక్షాత్కరింపఁజేయునట్లు స్పష్టమైన భాషలో రమ్యములైన యలంకారములతో ననుభవపూర్వకముగా వర్ణించుచుండును. అతని వర్ణనపద్ధతి క్లిష్టవిషయమును గూడ పఠితలకు సుగమమును, నానందప్రదమును గావించుచుండును.

లింగమూర్తి కావ్యారంభమున కవి లక్షణములనిట్లు చెప్పెను. :—
మహితగురులఘు వర్ణధర్మములు నియమ
ములుఁ గలితకర్తృకర్మక్రియలను, దెలిసి
నామరూపావ్యయ విలక్షణంబు లాత్మ
నెఱిఁగిన కవీశ్వరుండె కవీశ్వరుండు ! (1-10)

కవీశ్వరుఁడనఁగా కవీంద్రుఁడనియు, నుత్తమజ్ఞానియనియు రెండర్థములు గలవు. ఈ పద్యము నందలి విశేషణము లా యిరువురికి నన్వయించును. ఛందశ్శాస్త్రమునందు చెప్పఁబడిన గురులఘు వర్ణనిర్ణయమును, వ్యాకరణము నందుఁజెప్పఁబడిన కర్త, కర్మ, క్రియ, విశేషణము, అవ్యయము మున్నగు భాషాభాగములకుఁగల విశేషలక్షణములను దెలిసికొన్నవాఁడే కవి. చిత్తశుద్ధి గల్గించు వర్ణాశ్రమ ధర్మపరిజ్ఞాన పూర్వకములైన శ్రౌతస్మార్త కర్మస్వరూప ముల నెఱింగి, నిత్యానిత్యవస్తు వివేకము గలవాఁడే యుత్తమ జ్ఞాని. లింగమూర్తి యందీ రెండు లక్షణములును జూపట్టుచున్నవి. అతఁడెంత మహాకవి యోయంత మహాజ్ఞాని. తరువాత నీ క్రింది పద్యమున నతఁ డౌద్ధత్యము మానుటకై కుకవుల నభినందించి యున్నాఁడు.

శుద్ధపదయుక్తిఁదొరఁగియ
బద్ధమును నిబద్ధిగా, నిబద్ధినొగిమహా
బద్ధముగాఁగను కుకవుల
నౌద్ధత్యము మానుకొఱకు నభినందింతున్ (1-13)

లింగమూర్తి జ్ఞానసంపన్నుఁడగుటచే నన్యకవులవలె కుకవుల నిందింపక "మూర్ఖంఛందాను వర్తనా"త్తను న్యాయము ననుసరించి యభినందించి యున్నాఁడు. దోషరహితములైన పదములను వాడక యసందర్భాంశములను సందర్భాంశములుగను, సందర్భముల నసందర్భములుగను బలికించు కుకవులను, నశ్వరమగు దేహాదికమును నాత్మయనియు, నిత్యమగు నాత్మను దేహాదికము గను భ్రమించు మూఢులను అతఁడిం దౌద్ధత్యము మానుటకై యభినందించి యున్నాఁడు.

కావ్యమునకేది యాత్మయను విషయమున పూర్వ లాక్షణికులు భిన్నాభిప్రాయములను ప్రదర్శించియున్నారు. ఆనంద వర్ధనుఁడు వస్త్వలంకార రసాత్మకమగు ధ్వనియే కావ్యమున కాత్మయని నిరూపించి యున్నాఁడు. లింగమూర్తి ద్వితీయాశ్వాసమున "తత్త్వమసి" యను మహావాక్యమున కర్థము వివరించుచు నఱువదొకటవ వచనమున తత్-త్వమ్ పదముల వాచ్యలక్ష్యార్థము లను జహదజహల్లక్షణలచేత నుభయ వాచ్యార్థముల నిషేధించి ద్వివిధ లక్ష్యార్థముల కైక్యము తెలియు విధానమును నిరూపించి యున్నాఁడు అట్లే

ద్వితీయాశ్వాసమున 'అహంబ్రహ్మ'అను పదములకుఁ గల వాచ్యలక్ష్యార్థములను గూడ వివరించియున్నాఁడు.

క్రమమొప్పార నహంపదంబునకు నీకాయేంద్రియ ప్రాణచి
త్త మనోహంకృతిబుద్ధి రూపజడజాతంబెల్ల వాచ్యార్థమా
ద్యము సచ్చిత్సుఖరూపమై తనరుశుద్ధ ప్రత్యగాత్మప్రకా
శములక్ష్యార్థము, వేదశాస్త్రగరహస్యంబింత నిక్కంబగున్ (3-126)

సర్వమువాచ్యార్థము, త
త్సర్వాధిష్ఠాన శుద్ధచైతన్యము చి
త్పూర్వక లక్ష్యార్థంబు సు
పర్వవినుతవినుము బ్రహ్మపదమున కరయన్ (3-127)

ఉభయవాచ్యార్థములతోడ నొప్పుచున్న
నుభయలక్ష్యార్థములకైక్య మొదవదట్లు
గాన వాచ్యార్థముల రెంటిఁగడకుఁ ద్రోచి
యెనయ లక్ష్యార్థమొకటిగా నెఱుఁగవలయు (3-128)

అహం శబ్దమునకు దేహేంద్రియాదులైన యజ్ఞాన వృత్తులెల్లను వాచ్యార్థమగును. సత్యజ్ఞానానంద స్వరూపమైయున్న కూటస్థచైతన్యరూపము లక్ష్యార్థము. బ్రహ్మపదమునకు ప్రపంచము వాచ్యార్థము. దానికధిష్ఠానమైయున్న జ్ఞానస్వరూపమగు పరబ్రహ్మము సచ్చిదానందాది లక్షణములచేత లక్షితమైన లక్ష్యార్థము. అహం-బ్రహ్మపదములకుఁ గల వాచ్యార్థములు రెండింటితోడఁ గూడియున్న ద్వివిధలక్ష్యార్థములకు నైక్యముగలుగ నేరదుగాన నా వాచ్యార్థములను విడిచి లక్ష్యార్థములైన కూటస్థ పరబ్రహ్మమును మాత్రమే గ్రహింపవలయునని యర్థము. కూటస్థ పరబ్రహ్మములకు సమానమైయున్న యానంద యొక్కటియగుటయే "అహంబ్రహ్మాస్మి"యను మహావాక్యమునందలి 'అస్మి' యను పదమున కర్థము. ఈ విధముగా పై మహావాక్యములకు వాచ్యలక్ష్యార్థములు తెలిపి పరమార్థము నెఱింగించుటలో లింగమూర్తి చూపిన ప్రతిభ ప్రశంసాపాత్రమై యున్నది.

పద్యరచన విషయమున లింగమూర్తిపై పోతరాజు ప్రభావమధికముగాఁ గన్పించును. అతనివలె నితఁడును నర్థశబ్దాలంకారములను విరివిగా

వాడును. ఇట్లలంకారములపై మక్కువ చూపినను అతఁడర్థమున కెక్కడను భంగముకలుగ నీయఁడు. ఇది యీయిరువురి కవుల రచనయందును గల ప్రశంసనీయమైన ప్రత్యేక లక్షణము. లింగమూర్తి యర్థాలంకారములలో నుపమాలంకారమును, రూపకోత్ప్రేక్షలను అధికముగా వాడియుండెను. అతఁడు వాడిన యుపమానములు పెక్కుక్లిష్టమైన తాత్త్వక భావములను గూడ సులభముగా నర్థముచేసికొనుటకు తోడ్పడుచుండును.

వనితాసందన చందనాది విషయవ్రాతంబులంబొందిచ
య్యన నంతంతకుఁ జొక్కు నెమ్మనము బ్రహ్మానందవారాశివా
సన యొక్కించుక సోఁకెనేనిఁ బ్రవినాశంబొందు, నానాద్రుపు
ష్పనటద్భృంగము చంపకప్రసవ సంస్పర్శార్తిఁగూలుంగతిన్ (3-57)

మనసు స్త్రీ చందనాది భోగములంజొక్కి సోలుచుండియు బ్రహ్మానందము పొందినతోడనే యందు లయించి యడఁగి పోవును. తుమ్మెద నానాపుష్ప మకరందముల నాని చొక్కుచు సంపెంగ వాసన సోఁకినతోడనే మూర్ఛిల్లుట పై తాత్త్వక విషయమున కుపమానముగాఁ జెప్పఁబడినది.

మత్సాన్నిధ్యమువలన న
చిత్సాహంకార పవన చిత్తేంద్రియముల్
వత్సా : చలియించును రం
గత్సదయస్కాంత సూచికల చందమునన్ (2-110)

జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు మున్నగునవి సహజముగా జడములయ్యును, సూదంటు రాతి చెంతనుండుట వలన జడములైన యినుపసూదులు కదలాడునట్లు చిద్రూపుఁడగు తాను తమయందు ప్రతిఫల రూపమున సన్నిధి నుండుటచే సచేతనములవలె మెదలుచుండునని రాముఁడాంజనేయునకుఁ జెప్పియున్నాఁడు. ఇందలి యుపమానములు సందర్భోచితములై విషయమును పతితలకు విస్పష్టము గావించుచున్నది.

అచలచరేంద్ర : దీపము ఘటాదిపదార్థములన్ వెలుంగఁజే
యుచును వెలుంగునట్టులు సముజ్జ్వలమానసచక్షురాదిదృ
శ్యచయమునెల్ల నాత్మవిషయంబులయందుఁ జరించునట్లుచూ
చుచు మఱియేను సాక్షినగుచున్ విలసిల్లుదు నిర్వికారతన్ (2-83)

ఇందు చక్షురాది దృశ్యములును, వాని నాత్మవిషయములందు చరించునట్లుచూచుచు సాక్షిభూతుఁడై నిర్వికారతతో నుండు పరబ్రహ్మ రూపుఁడైన శ్రీరాముఁడును నుపమేయములు. ఘటాది పదార్థములును, వానిని వెలుఁగఁజేయుచు తనకుఁ దానై ప్రకాశించు దీపమును, నుపమానములు. ఇట్లే లింగమూర్తి దురవగాహములైన తాత్త్వికవిషయములను గూడ పాఠకులకు సులభముగా బోధపడుటకై లోకసామాన్యములును, సర్వపరిచితములునైన యుపమానములను వాడిన సన్నివేశము లనేకములున్నవి. ఇవి యన్నియు నతని లోకపరిశీలనమును, నౌచిత్య పరిజ్ఞానమును వెల్లడించుచున్నవి.

ఓంకారనాదమును వర్ణించుపట్ల నుదాహరింపఁబడిన పద్యములు రెండును లింగమూర్తియుత్ప్రేక్షాలంకార ప్రయోగపాటవమునకు నిదర్శనములు. అతఁడు సీతారామాంజనేయ సంవాదమున రూపకాలంకారములతోఁ గూడిన పద్యముల సంఖ్యాకముగా రచించెను.

ఉరురాగాదిగుణాజసంఘమును నాదోఁకారమంత్రంబుచే
తరయంబారవధించి యాత్మవిషయేధ్మశ్రేణితోఁగూడ చె
చ్చెరనానావిధ వాసనాజ్యములతోఁ జిద్వహ్నిమధ్యంబునన్
వరుసన్ వ్రేలిచి సౌఖ్యసోమరస పానంబంతఁ గావింపవే (1-154)

ఈ పద్యమున రాగాది గుణములం దజసంఘత్వమును, నోంకార మంత్రమునందు ఖడ్గత్వమును, విషయములయం దిధ్మత్వమును, నానావిధవాసనలయం దాజ్యత్వమును సౌఖ్యమునందు సోమరసత్వమును, జిత్తునందు వహ్నిత్వమును నారోపింపఁబడినవి.

శాంతి వరకామధేనువు
సంతోషమె కల్పలత విషయ విరతియగున్
జింతామణియని నెమ్మదిఁ
జింతించునతండు సుఖముఁజెందు బుధేంద్రా ! (3-179)

ఈ పద్యమున శాంతియే కామధేనువనియు, సంతోషమే కల్పలతయనియు, విషయవిరతియే చింతామణియనియుఁ జెప్పఁబడినవి.

"బ్రహ్మహత్యాఖ్యపాప తమోర్కబింబంబు, మధుపాన దోషాభ్రమారుతంబు" (1-53). "అంతకు మున్ననీ వపరోక్ష విజ్ఞాన చక్షువుల్‌దెఱచి" (1-146) "కామాదిఖగములఁ గజిబిజులడఁగ (1-149) "ధరణీపదంబుఐన్ దివిత తంబగు మస్తక మంతరిక్షమున్" (2-44) మున్నగు ననేక పద్యములయందు రూపకాలంకారముగలదు.

లింగమూర్తి నాలుగైదుచోట్ల శ్లేషాలంకారమును గూడ వాడియుండెను. కథారంభమున కైలాసమును జిహ్వలాసముతోఁ బోల్చిన పద్యమును, దాని తరువాతి దీర్ఘ వచనమును, "మహితగురు లఘు వర్ణధర్మములు" అను కవీశ్వరుని నిర్వచనముతోఁ గూడిన పద్యమును శ్లేషాలంకారమునకు దాహరణములు. ఇవిగాక క్రమాలంకారము, కావ్యలింగము, అర్థాంతరన్యాసము, అతిశయోక్తి. దృష్టాంతము మున్నగు పెక్కర్థాలంకారములను గూడ నతఁడు తన కావ్యమున ప్రయోగించి యుండెను.

ఇంక నతఁడు రచించిన శబ్దాలంకార సహిత పద్యము లసంఖ్యాకములు. కొంచె మించుమించుగానన్ని పద్యముల యందును శబ్దాలంకార సాహిత్యము గోచరించును.

మందాకినీసుధాసందోహదుగ్ధాబ్ది
సౌందర్యలహరుల చందమునను (1-141);

సద్యస్తమోనాశ ఖద్యోతమాన సద్విద్యుల్లతా ప్రభావీథివగిది (1-142); "హృదయసదనమునఁ బొదలెడి సదమల నాదామృతము" (1-132); "అస్తోక సద్గురూపాస్తిచే సతతవిధ్వస్తకాముండు నిరస్తమోహుఁడు" (2-145) జాగ్రదాది వినిగ్రహాను గ్రహప్రతి గ్రహసమగ్ర జాగరూకాగ్రహోగ్ర విగ్రహోత్కగ్ర" (2-16) మున్నగునవి వృత్త్యనుప్రాసమునకు తార్కాణములు. 'ఘనపాపమును మాప తనుతాపమును బాపఁ దన రూపమును జూపఁ దనరు వాని (1-8)" అను మహాదేవ వర్ణనపూర్వకమైన పద్యము వృత్తిచ్ఛేకాను ప్రాసములకు నిలయమై యున్నది.

ఖంబుసుమీమది, విషయను
ఖంబుసుమీ, త్రిజగదభిము ఖంబుసుమీ, దుః

ఖంబుసుమీ, యదితద్వి మ
ఖంబుసుమీ, నిరతిశయ సుఖంబు కవీంద్రా (2-137)

ఇందు 'ఖంబు'అను నక్షరములు పలుమాఱులుపునరుక్తములైనవి. ఒక విధముగా దీని నంత్యాను ప్రాసమనియుఁజెప్పవచ్చును. ఇందుత్రిప్రాసము గూడ కనిపించుచున్నవి.

తారక ముద్భవాంబునిధి తారక, మంబుజసంభవాది బృం
దారక సన్నుత, మ్మఘవిదారక, మంచితరాగరోషసం
హారకముం, బ్రధానపరిహారక, మాత్మసుఖాను భూతివి
స్తారక, మాగమాంతసువిచారకమై తనరామ మారుతీ (1-93)

అను పద్య మంత్యానుప్రాసముతోఁ గూడి యున్నది. ఇట్టి పద్యము లింకను లెక్కకు గలవు.

ఇరవుగ నెన్నఁదెన్నఁడొక యించుకలేకయ యున్న యున్నతిన్
బొరలు వికారకారణము బోధమ, దీని తెఱంగురంగుగా
నెఱిఁగి శమించిమించి పరమేశ్వర భావముఁ బొంది బొందిదా
మఱచిన ధీర ధీరుచిరమార్గుఁడు మోక్షముఁ జేరుఁ జేరువన్ (2-93)

ఈ పద్యమున యమకము ఛేకాను ప్రాసము కూడ నున్నవి.

వినువినువీధి తెఱంగున
ఘనఘనమై విభువు సర్వగతమై తగుచే
తనుదనుదను తనువునఁగని
మనుమనుజుని బ్రతుకు బ్రతుకు మారుతతనయా (2-138)

ఇందు ఛేకానుప్రాసము, లాటానుప్రాసము, యమకము అను శబ్దాలంకారములు మూఁడును గోచరించుచున్నవి. మొత్తము మీఁద మొదటిరెం డాశ్వాసములకంటె మూఁడవ యాశ్వాసమున శబ్దాలంకార ప్రయోగము తక్కువగా నున్నది.

శబ్దాదివిషయపంచకము దృశ్యంబగు
శ్రవణాది కరణపంచకమునకును

శ్రవణాదికరణ పంచకము దృశ్యంబగు
తతమనోబుద్ధ్యహంకృతులకరయ (2-96)

అను పద్యమున ముక్తపదగ్రస్తమున్నది. ద్వితీయాశ్వాసమున 147. 148. 149. 150 సంఖ్య గల సీసములు సర్వతః ప్రాసములతోఁ గూడి శబ్దాలంకారమయములై యున్నవి.

నానానూనుని ననిన న
న్నేనేనన నిన్ను నన్ను నేననననినన్
నేనని నే నన్నానా
నేనను నన్నెన్ని నన్ను నిను నేననవా! (2-88)

అను పద్యమున నచ్చులు భిన్నములైనను హల్లులన్నియు నకారములే. ఇది యేకాక్షరకందము. నానా + అనూనునిన్ + అని + నన్నే + నేను + అన + నిన్ను + నన్ను + నేను + అనన్ + అనినన్ + నేను + అని + నేను + అన్నానా + నేను + అను + నన్ను + ఎన్ని + నన్ను + నిను + నేను + అనవా! అని యిందలి పద విభాగము. ఇందు జీవబ్రహ్మైక్యము చెప్పఁబడినది.

మేను మనము మానముమును
నేనను మానమ్మమాని నేమమ్మన న
న్నేనేనని నమ్మిన నీ
మాన మనూనానుమానమైమను నెమ్మిన్ (2-89)

ఇది న-మ యను నక్షరములతోఁ గూడిన ద్వ్యక్షరకందము. మేను + మనము + మానము + మును + నేను + అను + మానమ్మ + మాని + నేమమ్మన + నన్నే + నేను + అని + నమ్మినన్ + ఈమానము + అనూనానుమానము + ఐ + మను + నెమ్మిన్. స్థూలశరీరమును సూక్ష్మశరీరమును వానియందలి యభిమాన రూపమగు కారణశరీరమును, నేనను నహంకారమును విడిచి నియమముతో నస్మత్ ప్రత్యయైక గోచర స్వరూపుఁడనగు నన్నే యవిద్యోపాధి వినిర్ముక్తుఁడనైన నేనని నమ్మినచో నీ విశ్వాసము గొప్ప యుక్త్యనుభము ననుసరించునట్టిదై నెమ్మదిగా నఖండైకరస పరమాత్మ స్వరూపమై విలసిల్లును. కొన్ని పద్యములలో నర్థాలంకారములతోపాటు శబ్దాలంకారములు గూడఁ గూర్పఁబడినవి.

ఇతని రచనలో నూటికి డెబ్బదియైదు పాళ్లు సంస్కృత పదములే గోచరించును. కొన్ని పద్యములలో నొక్క-క్రియా పదము దప్ప మిగిలిన వన్నియు సంస్కృత పదములే యైయుండును.

దివ్యము భవ్యంబగుమ
త్కావ్యము సంతతము మోక్షకాములచే శ్రో
తవ్యము వక్తవ్యముమం
తవ్యము భావ్యమును గీర్తితవ్యముగాదే ! (1-19)

అను పద్యమున ము-లచే - అను విభక్తిప్రత్యయములును, కాదే, యగు నను పదములును దప్ప మిగిలినవన్నియు సంస్కృత పదములు. ఇట్టివింకను బెక్కు-పద్యములుగలవు. మూఁడు నాలుగుచోట్ల యత్-తత్ పదములతోఁ గూడిన సంస్కృత వాక్యయోజనము గూడఁ గన్పించును.

ఇదియు నదియునట్టి దిట్టిదింతంతని
పలుకరాని దెద్ది బ్రహ్మమదియె
ఇదియు నడియు నట్టి దిట్టి దింతంతని
యరయు తెలివియదియె యవియునదియె (2-17)

అను పద్యమున నొక్క- బ్రహ్మపదము దప్ప మిగిలినవన్నియు తెలుఁగు పదములు. ఇందు బ్రహ్మ మనిర్వాచ్యమనియు, జ్ఞానమును, జ్ఞేయమును నదే యనియు, సర్వమును బ్రహ్మమయమనియు తెలుపఁబడినది. ఈ గ్రంథమున ఇట్టి తెలుఁగు పదముల ప్రాచుర్యముగల పద్యముల సంఖ్య చాల తక్కు-వ.

సీతారామాంజనేయ సంవాద మందలి కొన్ని పద్యములలో పోతనాది పూర్వకవుల పద్యముల పోకడలు కనిపించును.

దారుణగాఢాంధ కారంబడంగునే
వసుధపైఁగృత దీపవార్తవలన (1-95)

ఇది భాగవతమునందలి

సంసార జీమూత సంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభంజనములేక

అను పోతన పద్యము ననుకరించుచున్నది.

ఆధారం బిలయై జలంబుమణి పూరాంభోజమై (2-47)

అను పద్యము

ధరసింహాసనమై నభంబుగొడుగై –అని పోతన కృతముగా ప్రఖ్యాతమైన నారాయణ శతకమునందలి పద్యమును జ్ఞప్తికి తెచ్చుచున్నది.

అటఁ బొడఁగాంచె మారుతి హృదంబురుహాంతరబింబితస్ఫుర
చ్చటుల పునఃపునశ్చలదసద్విషయ స్పృశదింద్రియాన్వితో
త్కటపటు ధీప్రవృత్తి నిహితజ్ఞకళాగ్రనివేశమున్, విశం
కటనిజభా ప్రకాశిత జగద్ద్వజ కోశము, స్వప్రకాశమున్ (2-16)

అను పద్యమంత్యాను ప్రాసముతోఁగూడి మనుచరిత్రము నందలి.

అటఁజనిగాంచె భూమిసురుఁడు–అను పద్యమును బోలియున్నది.

ఇతని సీసములు పెక్కు శబ్దాలంకారములతోఁ గూడి భట్టుమూర్తి సీసములను తలపించుచుండును.

తమ్ములఁబంపెదన్, మణిశతమ్ములఁబంపెద, రాజహంసపో
తమ్ములఁబంపెదన్, బరిచితమ్ములఁగానన దేవతాళిజా
తమ్ములఁబంపెదన్, ద్రుతగతమ్ములనేనును సారణీప్రపా
తమ్ములపత్తు, విశ్వవిదితా ! ముదితా ! మదితాపమేటికిన్.

అను పద్యమున భట్టుమూర్తి గిరికతోఁ తమ్ములతో పాటు మఱెందఱో 'తమ్ము ల'ను బంపియుండెను.

తమ్మునెఱుంగలేవు విహితమ్ముగ దేహము ప్రాణపంక్తి చి
త్తమ్ముదశేంద్రియమ్ము లుచితమ్ముగ నన్యము గాన లేమి స
త్యమ్ముగు నో కపీంద్ర ! సతతమ్మువానిఁదదీయకార్యజా
తమ్మును నేనుగాంతు సనృతమ్ముగ నన్నిఋతమ్ముగాఁదగన్ (2-108)

అను పద్యమును లింగమూర్తి పై వసుచరిత్ర పద్యమును మనసులోనుంచుకొని వ్రాసెననుటకు సందేహింప నక్కఱలేదు.

మాయను మిథ్యగాఁదెలియుమాయనుఁ; దత్కృతమెల్లఁగల్లను
మ్మాయను, మేను నేననకుమాయను, సాక్షివినీవుచూచుకా
మ్మాయనుఁ, జూడఁగా నితరమాయను, నేనని నిశ్చయించుకా
మ్మాయనుఁ, గాకపోనితర మాయను మానము మానుమాయనున్ (2-143)

అను పద్యము-హాయను ధర్మరాజతనయాయను-అను పద్యమును బోలి యున్నది. ఇది మాయను-మాయను అను పదముల పునరుక్తితోఁగూడి యుండుటే కాక యమకాలంకారమునకుఁగూడ దృష్టాంతమైయున్నది.

లింగమూర్తి కంద సీసగీతములను సాధారణ వృత్తములను గాక సుగంధి-వనమయూరము-మాలిని-పంచచామరము - మానిని - కవిరాజవిరాజితము-సుందరి మున్నగు ముప్పది విశేషవృత్తములను గూడ వాడియుండెను. కాని వీని లోనొక్కొకదాని సంఖ్య యొకటి రెండింటి కంటెమించదు. ఇట్టి వృత్తవైవిధ్యము హనుమత్స్తోత్రమునందే యెక్కువగాఁగలదు. లింగమూర్తి మనోవృత్తి కనుగుణముగా నిచట విశేష వృత్తములను వాడియుండును. వీనిలో సాధారణముగా మొదటి విశేషణ పదమే వ్యంజనముతో నారంభించునో మిగిలిన విశేషణములు కూడ నావ్యంజనములతోనే యారంభించుచుండును. హనుమంతుఁడు శ్రీరాముని స్తుతించునపుడొక దండకముగలదు. అట్లే తత్త్వజ్ఞాని ప్రారబ్ధవశముచే స్వవర్ణాశ్రమోచిత ధర్మములయందు ప్రవర్తించుచున్నను జీవబ్రహ్మైక్యయోగమును, ముక్తిని తెలిసికొనియుండునని తెలుపు సందర్భమున కవియొక ద్విరదగతిరగడను రచించెను. ప్రబంధములలో నిట్టిరగడలు పుష్పాపచయజల క్రీడాది సందర్భములందు వ్రాయఁబడుచుండును ప్రబంధములన్నియుఁ జదివిన వాఁడు గావున నితఁడట్టిరగడను ప్రయత్న పూర్వకముగా వ్రాసియుండెను.

సీతారామాంజనేయ సంవాదము చంపూకావ్యమగుటచే నచ్చటచ్చట వచనములు గూడ వ్రాయఁబడినవి. అందులో నేడెనిమిది దీర్ఘ వచనములు. ఇట్టి వచనముల నాతఁడు తత్త్వవిషయ వివరణమునకును, వస్తువర్ణనమునకును వాడియుండెను. ఈ వచనములు వేదాంత విషయక్లిష్టములును, సంస్కృత సమాసభూయిష్ఠములునైనను ధారాశుద్ధిఁగలిగి నన్నయవచనములతో సామ్యము

వహించుచున్నవి. ద్వితీయాశ్వాసమందలి 158 సంఖ్య గల వచనము చిన్న చిన్న వాక్యములతోఁ గూడి యాత్మసత్య స్వరూపమును చక్కఁగా వివరించుచున్నది.

లింగమూర్తి రచనయంతయు నతఁడు ప్రతిపాదించిన విషయమువలెనే హృద్యము, నిరవద్యము, గంభీరమునై యలరారుచు పఠితలకు తత్త్వవిషయమును గూడ కరతలామలక మొనరించును. ఇతని పద్యములు ధారాశుద్ధి గలిగి కుంఠితగమనము లేక యాశ్రమోపాంత మందలి గిరి నిర్ఝరులవలె ప్రవహించుచున్నవి. ఇతని రచనయంతయు వ్యాకరణానుసారియు, లాక్షణికమును నై తత్త్వవేత్తలకేకాక పండితులకుఁ గూడ ప్రమోదము నిచ్చుచున్నది. సంసేవింపుచున్ (1-1), ఆడింపుచుండు (1-38), ఎఱింగింపుదున్ (2-107) అనుచో 'ించు' కాగమమునందలి 'చ' కారమునకు 'ప' కారముగలిగినది. ఇతఁడు 'కలుగు' శబ్దమును రెండుచోట్ల కలుంగు'అని బిందు సహితముగా వాడియున్నాఁడు. ఇది ప్రామాదికమై యుండవచ్చును. మూఁడవ యాశ్వాసమందలి 57వ పద్యమున "చంపక ప్రసవ సంస్పర్శాప్తిఁ గూలుంగతిన్"అనుచోట 'కూలు'అను తద్ధర్మ విశేషణమునకు హల్లుపరమైనప్పుడు గూడ నుగాగమమును జేసినాఁడు. ధూర్జటి మున్నగు పూర్వకవుల గ్రంథములలో గూడ నిట్టి ప్రయోగము క్వాచిత్కముగాఁ గన్పడుచున్నది. లింగమూర్తి మానకన్, ఏలన్ అను వానిని గూడ ద్రుతాంతముగా వాడియున్నాఁడు. ఇట్టి స్వతంత్ర ప్రయోగములు రెండు మూఁడు గనవచ్చినను ఇతనిరచన యాద్యంతము నిర్దుష్టమై, విషయగంభీరమై, యనన్యసాధారణమై యలరారుచుండును. తత్త్వమును ప్రతిపాదించు ప్రబంధములలో దీనితో సాటివచ్చు కావ్యమింకొకటి లేదని చెప్పవచ్చును. లింగమూర్తి యెంతటి మహాయోగియో యంతటి మహాకవి; ఎంతటిజ్ఞానియో యంతటి మహా పండితుఁడు.

లింగమూర్తి సీతారామాంజనేయ సంవాదమునే కాక రతిమన్మథ విలాసమను ప్రబంధమును, జీవన్ముక్తి ప్రకరణమను యక్షగానమును, నారదపరమేష్ఠి సంవాదమును, సాంఖ్యతారకామనస్క యోగసీసతారావళిత్రయమను పేర నొక్కొక్క యోగమునకు నిరువదేడు పద్యముల చొప్పున మొత్తమెను

బదొక్క సీసపద్యములను, మానసశతకమును, సీత పాటయను పేరుగల సీతారామ సంవాదమను గేయకావ్యమును రచించి యుండెను. ఇందు సీతపాట యొక్కటి మాత్రమే ముద్రితమైనది. సీతారామాంజనేయ సంవాదమునకు పాట రూపమున వ్రాయఁబడిన సారాంశమిది. ఇందలి 550 పాదములలో 200 పాదములు సాంఖ్యమును, 180 పాదములు తారకమును, 170 పాదములమనస్కమును వివరించును. ఇందలి ప్రతి పాదము చివరను 'సీతా'అను సంబోధనముండుటచే దీనికి సీతపాటయను పేరు వచ్చినది. "ఇల పరశురామ పంతుల లింగమూర్తి యన వెలయుఘను డుదయించి సీతా !—సనయ సీతారామ సంవాదమను పాటయను భవోక్తులచేత సీతా ! ఘనయుక్తి రచియింపఁగలఁడంత బుధులెల్ల విని సంతసింతురో సీతా !" అనునవి యిందలి చివరి పాదములు, ఇందలి భాష సరళముగను నిర్దుష్టముగను ఉన్నది. గేయమాద్యంతము తాళలయ బద్ధమై శ్రవణ సుభగముగా నున్నది. ఇది సామాన్యజనుల యుపయోగముననే వ్రాయఁబడినను ఆంధ్ర గేయ సరస్వతి కలంకారమని చెప్పఁదగియున్నది రతిమన్మథ విలాసము లింగమూర్తి మొదటి రచన, పేరును బట్టి యిది శృంగార రసప్రధానమైన ప్రబంధముగా కనవచ్చుచున్నది. ఇది హనుమంతుని కంకితము చేయఁబడినది. దీనిని వ్రాయునాఁటి కతఁడు శృంగార రసలోలుఁడైన యువకుఁడుగా నుండి క్రమముగా పరిపక్వ చిత్తుఁడైన భక్తవరేణ్యుఁడుగను యోగిపుంగవుఁడుగను పరిణమించి యుండును. ఇందలి రచన కూడ నించుక యపరిపక్వదశలోనే యున్నదని దానిని పఠించిన విమర్శకుల అభిప్రాయము. సీసతారావళి త్రయము నందలి ప్రతి సీసముచివరను "చెప్పె నారాయణస్వామి శిష్యుఁడైన లింగమూర్తి మహాగురు లింగమూర్తి"యను మకుటమున్నది. మహాదేవ గురుని ప్రశంసయిందులేదు. దీనిని బట్టి మహాదేవ గురు నాశ్రయింపక పూర్వమే యతఁడీ తారావళులను రచించి యుండునని యూహింపవచ్చును. అతఁడు వ్రాసిన యితర గ్రంథములను గూర్చి యేమియు తెలియదు. మహాకవి, మహాయోగి, విద్వద్వరేణ్యుఁడు, గురుమూర్తి సార్థకనామ ధేయుఁడునైన లింగమూర్తి యితర గ్రంథములను కూడ సంపాదించి ముద్రించినచో నవి యాంధ్రవాఙ్మయమునకు సాధారణముగను, ఆంధ్రము నందలి తత్త్వవాఙ్మయమునకు ప్రత్యేకముగను వన్నె చేకూర్చుననుటలో సందేహములేదు.

—దివాకర్ల వేంకటావధాని

# శ్రీ పరశురామ పంతుల లింగమూర్తి గురుమూర్తి

---

రచయిత : శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి

శ్రీ పరశురామ పంతుల లింగమూర్తి, రామమంత్రి, తిమ్మమాంబ, యను పుణ్యదంపతులకు, శ్రీ॥ శ॥ 1700-20 ప్రాంతమున ఈదులవాయి గ్రామమున జన్మించెను. ఋగ్వేద ఆశ్వలాయన శాఖకు చెంది, భారద్వాజస గోత్రుడైన ఇతడు నియోగి బ్రాహ్మణుడు. భార్య లింగమాంబ, కుమారుడు రామమూర్తి కవి. జ్ఞాతి విరోధముచేత 'ఈదులవాయి' గ్రామమును విడిచి పర్యటనము చేయుచు 'అంబాల'అను గ్రామముచేరెను. అసలు ఈ వంశమువారి పూర్వులు మహారాష్ట్ర దేశమువారు. దేశవిప్లవాదుల వలన మహారాష్ట్ర దేశమునుండి "దండాపంతు, శ్యామాపంతు, పరశురామపంతు"అను వారు తెలుగు దేశమునకు వచ్చి, ఇచ్చట స్థిరనివాస మేర్పరచుకొనిరి. వారిలో పరశురామ పంతుకు సంబంధించినవారు వరంగల్లుకు దాదాపు 30 మైళ్ల దూరమునందున్న పెనగవరము అను గ్రామమున వృత్తిస్వాస్థ్యము లేర్పరచుకొని, సమీపస్థులగు నియోగులతో సంబంధ బాంధవ్యము లేర్పరచుకొని, మూల పురుషుని పేరు ఇంటి పేరుగా మారి పరశురామ పంతులవారైరి. లింగమూర్తి తల్లిదండ్రుల కాలానికి 'ఈదులవాయికి' మారుట జరిగినది. జ్ఞాతి విరోధము కారణముకాగా లింగమూర్తి అంబాలకు చేరెను. చిన్నతనముననే సంస్కృతాంధ్రములను చదివి, చక్కని కవితను వ్రాయగల శక్తిని సంపాదించియుండెను. "రతి మన్మథ విలాసము"అను కావ్యమును రచించి యుండెను. చక్కని పాండిత్యము, మధురమైన కవిత చేతిలో నుండుటచేత స్వగ్రామమును విడిచి దేశాటనము చేయుట యందును, 'అంబాల' గ్రామములో కొంతకాలముండుట యందును లింగమూర్తికి శ్రమకలుగలేదు.

'అంబాల'లో నున్నప్పుడే బహుజన్మకృత సుకృత పరిపాకముచేత లింగమూర్తికి వైరాగ్యము కల్గి ఆధ్యాత్మిక తత్వచింతన యందును, రామ

తారక మంత్రజపానుష్ఠానముల యందును మనసుకల్గెను. వెదుకబోయిన తీగ కాలికిదగిలినట్లు లింగమూర్తికి అంబాలలోనే "కుసుమ నారాయణ"అను భక్తుడులభించెను. అతని వద్దికి వెళ్లి తన కధ్యాత్మ విద్యనుబోధింపుమని కోరెను. కుసుమ నారాయణ లింగమూర్తికి తారక యోగమును ఉపదేశించి, తాను సాలెకులమువాడననియు బ్రాహ్మణుడైన లింగమూర్తికి శ్రీరామమంత్రమును ఉపదేశించుట తగదనియు తనకు గురువైన మహాదేవగురువు నాశ్రయించి ఆమంత్రోపదేశమును పొందుటకు 'మంథెన'యను గ్రామమునకు వెళ్లమనియు చెప్పెను.

శ్రీ కుసుమనారాయణ భక్తుని యాదేశాను సారముగా లింగమూర్తి మంథెనకు వెళ్లి శ్రీ మహాదేవగురువర్యులను సందర్శించి, ప్రార్థించి, శ్రీరామ మంత్రోపదేశమును పొందగల్గెను. కొన్నాళ్లు మహదేవ గురువర్యుల వద్ద శుశ్రూషచేసి వేదాంత విద్యారహస్యములను దెలిసికొని, వారి యనుజ్ఞతో అచ్చటికి సమీపమునందున్న పుణ్యక్షేత్రము 'రామగిరి' దుర్గమునకు వెళ్లి అచ్చట రామమంత్ర జపపురశ్చరణాదులను జేసి మంత్రసిద్ధిని పొందెను. తత్ఫలితముగా శ్రీరామ చంద్రుడు బ్రాహ్మణ రూపముతో దర్శన మొసగి, ఒక బంగారు రామమాడను, స్ఫటికవినాయక విగ్రహమును, మరకతలింగ సాలగ్రామమును, సీతారామమూర్తి విగ్రహమును ఇచ్చి, "వీటిని స్థానచలనము గావింపక నీ గృహమందుంచి పూజింపుము. సప్తపురుషాంతరముల వరకును ఇవి నీయింటనుండి సమస్తశుభములు ప్రసాదించు"నని చెప్పి యదృశ్యుడయ్యెను. ఈ విషయమును, శ్రీ లింగమూర్తికి తరువాత ఆరవతరమువాడైన పట్టాభిరామయ్యగారి కూతురు శ్రీమతి అమృతబాయమ్మగారు, (ప్రస్తుతమున్నారు.) వారి కథనము ప్రకారము లింగమూర్తిగారు 'అంబాల' గ్రామముననున్నప్పుడు కుసుమ నారాయణయను గురువువలన వేదాంత రహస్యములు తెలిసికొనుచుండగా, ఆ గురువు ప్రేరణచేత అచ్చటనున్న 'అంబాలగుట్టపైకి వెళ్లి, అచ్చటిగుండములో మునిగి స్నానజపాదులు చేయుచు మూడు రోజులుండెను. ఇంటికి వచ్చిన పిమ్మట శ్రీరామ చంద్రుడు ప్రత్యక్షమై "షట్చక్ర సీతారామము"అను సాల గ్రామమునిచ్చెను (ఆరు చక్రములు గల సాల గ్రామ శిల). ఇచ్చి "దీనిని స్థానచలనము గావింపక పూజింపుము. ఇది యేడుతరములదాక మీ పూజామందిరములోనుండును. పిమ్మట పరహస్తగతమగును. మీ

వంశము ఏడు తరముల వరకేనిలుచును. నీవు లోకమునందు మహాదేశికుడవుగా, కవిగా, కీర్తిప్రతిష్ఠల గడింతువు''అని చెప్పి అదృశ్యుడయ్యెను.)

శ్రీ లింగమూర్తి శ్రీషట్చక్ర సీతారామ సాల గ్రామాదులు లభించిన పిమ్మట, వరంగల్లునకు చేరువగా (ప్రస్తుతమందులో నొకపేటగా) ఉన్న మట్టెవాడకుచేరి యచ్చట మొదట కుటీరమును. తరువాత గృహమును ఏర్పరచుకొని అందులో దైవప్రసాదితములైన ''షట్చక్ర సీతారామ సాల గ్రామాదులను'' ప్రతిష్ఠించుకొని, స్వగృహమునందె జపతపములు పూజలుచేయుచు, అర్చామూర్తియైన శ్రీరామ చంద్రుని యనుగ్రహముచేత సకలవేదాంత సిద్ధాంతములను కరతలామలకము గావించుకొని అనుభవ పూర్వకమైన రాజయోగము చేత బ్రహ్మవిద్వరిష్ఠుడై శిష్యకోటికి కొంగు బంగారముగా భాసిల్లుచు, ''గురుమూర్తి'' బిరుద విఖ్యాతుడయ్యెను.

శ్రీ లింగమూర్తిగారి వంశజులు ఇప్పటికినిగలరు. ఆయన నిర్మించిన గృహమునందున్న భువనేశ్వరములో ఆయన సంపాదించిన దేవతావిగ్రహముల నిప్పటికిని పూజించుచున్నారు. ఇప్పటికి ఏడు తరములుగడచినవి, అర్చామూర్తులకు స్థానచలనములు గలిగింపలేదు. బంగారపు శ్రీరామ మాడ, స్ఫటిక వినాయక విగ్రహము, మరకత లింగము, సీతారామమూర్తి విగ్రహము మాత్రమున్నవి షట్చక్ర సీతారామ సాల గ్రామము మాత్రములేదు ఇప్పటికిని పూజ చక్కగా నిర్వహింపబడుచున్నది. చైత్రశుద్ధనవమినాడు సీతారామ కల్యాణమహోత్సవము కూడ జరుగుచున్నది. లింగమూర్తి పరమపదించిన తరువాత వారి గృహమునకు సమీపమునందే సమాధిని నిర్మించి క్రిందటి తరమువరకు ఈ వంశీయులు ఆ సమాధికి పూజాపురస్కారములు జరుపుచుండిరి. శ్రీ లింగమూర్తి తన యంత్యకాలమున సన్యసించుటయే ఆయనకు సమాధి యేర్పాటుచేయుటకు కారణము. ఆయన తరువాత వచ్చిన వారిలో 1. రామమూర్తి, కుమారుడు-ఈయన మహాకవి, తండ్రివలన శ్రీరామమంత్రోపదేశమును పొంది, రామానుగ్రహముచేత రాజయోగధురంధరుడై గొప్పకీర్తిని గడించెను ఈయన రచనలలో, శ్రీరామహృదయము (ద్విపద). జీవన్ముక్తి ప్రకరణము (పద్యములు) వివేకసారము, వేదాంత కీర్తనలు, ఈదులవాయి రామశతకము, పరశురామ శతకము, మనోహరశతము, అధ్యాత్మ రామాయణము (పద్యములు), శుకచరిత్రము, సీతారామాంజనేయులు-గేయ ప్రబంధము''

అను 10, గ్రంథములు లభించినవి. ఇందులో శుకచరిత్రము, సీతారామాంజనేయము మంత్రగ్రంథము. అధ్యాత్మ రామాయణము గొప్ప గ్రంథము. తండ్రియైన లింగమూర్తిగారు రచించిన "సీతారామాంజనేయ సంవాదము" సామాన్యులకు దుర్గ్రాహ్యమగుటచేతను, అప్పటికి దానికి వ్యాఖ్యానము లేకుండుటచేతను, వేదాంత విద్యను కరతలామలకము చేయుటకై ఈయన దానిని గేయముగా రచించియుండును. 2 ఈరామమూర్తి కుమారుడు లింగమూర్తి అతనిని గురించిన వివరములు తెలియవు. 3. లింగమూర్తి కుమారుడు రామకృష్ణ చయనులు. ఈయన వైదిక కర్మనిష్ఠాపరుడు చయనాంతమైన యజ్ఞాదులు చేయుటచేత ఇతనికి చయనులు" అన్నబిరుదనామము వచ్చినది. పితృపితామహుల నాటినుండి పరంపరగా వచ్చుచున్న శ్రీరామమంత్రమును పురశ్చరణముచేసి మంత్రసిద్ధుడై గురుపీఠమునెక్కి పల్లకీలో సంచారముచేయుచు శిష్యకోటికి వేదాంత రహస్యములను బోధించిన కీర్తిశాలి. 4. ఈయన కుమారులును, శ్రీ లింగమూర్తికి అయిదవతరము వారునునగు సీతారామయ్య, అనంతరామయ్య, దశరథరామయ్య, కోదండరామయ్య అను వారిలో, సీతారామయ్య తర్కశాస్త్రవేత్త, అనంతరామయ్య జోతిశ్శాస్త్రవేత్త, అంతేకాక వీరు నలుగురును రామమంత్రోపాసకులు, పండితులు, కవులు, గ్రంథకర్తలునునై యుండిరి.

పైనలుగురిలో చిన్నవాడైన కోదండరామయ్య కుమారుడు పట్టాభిరామయ్య. పట్టాభిరామయ్యా కుమారుడు రాధాకృష్ణరావు. ఈ 6, 7, తరముల వారిలో సంస్కృతాంధ్రములకు బదులు రాజకీయ విద్యలు ప్రవేశించినవి. 6. వ తరమునందలి పట్టాభిరామయ్య కూతురు అమృతబాయమ్మగా రిప్పుడున్నారు. వారే శ్రీ లింగమూర్తిగారు సంపాదించిన దేవతా విగ్రహములకు పూజలు, ఉత్సవములు నడిపించుచున్నారు.

## కవిగా శ్రీ లింగామూర్తి

పరశురామ పంతుల లింగమూర్తి బాల్యమునందు గురుకుల వాసముచేసి, సంస్కృతాంధ్రభాషలలో చక్కని పాండిత్యమును సంపాధించి కవియైయుండెను. అప్పటికింకను వేదాంత విద్యాప్రవేశము కలుగనందున "రతిమన్మథ

విలాసము''అను మూడాశ్వాసముల శృంగారకావ్యమును రచించెను. ఆకావ్యము నందలి గద్యములో ''శ్రీ మదాంజనేయ చరణకమల సేవావిధేయ శృంగార కవితాచమత్కార ధౌరేయ పరశురామ పంతుల లింగమూర్తి నామధేయ ప్రణీతంబైన రతిమన్మథ విలాసమను శృంగార ప్రబంధంబునందు''అని వ్రాసి కొని యున్నాడు. ఇది అతని యౌవనదశలో వ్రాసినకావ్యము. మొదట వేదాంత విద్యాప్రాభవములేక కవి మాత్రుడై యుండుట చేతనే కవితా రచనలో మంచి సాధనచేసి అనుభవము గడించినాడు. పద్యరచనయందు మంచిశైలి, ప్రౌఢి అలవడినవి. ఆగుణములు తరువాత రచించిన వేదాంత గ్రంథములలో కూడ చొచ్చుకున్నవి. ప్రజలకు సీతారామాంజనేయ సంవాదాది గ్రంథములు పఠనపాఠనయోగ్యములైనవి. ''రతిమన్మథ విలాస'' కావ్యరచనానంతరమున వైరాగ్య బ్రహ్మవిద్యా ప్రవేశములు లభించుటచూడగా ''కామిగాని మోక్షకామి గాడు'' అన్న సూక్తిని స్మరింపజేయును. రతిమన్మథ విలాసమును హనుమంతునికి అంకితము చేయుటచేత ఇతడు ప్రథమమున కవితాశక్తి ప్రముఖములైన ఇష్టసిద్ధులకై హనుమదుపాసకుడై యుండెననియు, హనుమదను గ్రహముచేత కవితాసిద్ధియేకాక శ్రీరామమంత్ర లబ్ధియుకలిగి మహాకవియు, మహావేదాంతియు, గురుమూర్తియునై విలసిల్లి యుండుననియునూహించుటకు వీలున్నది. మచ్చునకు కవితాశైలి.

మ॥ ''తనరన్ కాయముచేత రామచరణద్వంద్వైక దాస్యంబు హె
చ్చినభక్తిన్ తగువాక్కుచే ననిశమున్ శ్రీరామనామ ప్రకీ
ర్తనమున్, చిత్తముచేత రామపరతత్త్వధ్యానమున్ చేయు, శ్రీ
హనుమంతున్ సముపాశ్రయింతు మదభీష్టార్థంబు సిద్ధింపఁగన్

సీ॥ ''శృంగారమేపార సీతాంగనామణి
మును నిజవామాంకమున వసింప
తనపాదుకలు శిరంబున మోచిముందట
హనుమంతుఁడతి భక్తిననుసరింప
ధవళాతపత్రమాతత ధనుర్బాణమున్
దాల్చి లక్ష్మణుడుకై దండనలర
సరిఇరుగడల వింజామరంబులు పూని
భరతశత్రుఘ్నులు పరిఢవింప

తే॥గీ॥ అనుపమోజ్జ్వల రత్నసింహాసనమున
నమరఁగూర్చుండి, కోటి సూర్యప్రకాశుఁ
డై, వసిష్ఠాదిముని సమూహములచేత
చెలఁగి రాముండు పట్టాభిషిక్తుఁడయ్యె''

శా॥ ''వామాంకంబున దక్షిణాంఘ్రియును, తద్వామేతరాంకంబునన్
వామాంఘ్రిన్ ఘటియించి, పశ్చిమదిశావ్యాప్తంబు లౌ చేతులన్
సేమంబారగఁ గాళ్ల యంగుళములన్ జేకొన్న, పద్మాసనం
బౌ, ముక్కుంగొనఁ జూపునున్ చుబుకహృద్వ్యాసంగమున్ కల్గినన్''

వ్రాసినది వేదాంత గ్రంథమైనను కవితాసామర్థ్యవైచిత్ర్యాదుల విడువలేక సీతారామాంజనేయ సంవాదమునందు ''ఇంద్రవజ్ర, ఉపేంద్రవజ్ర, పృథ్వీ, భుజంగప్రయాత, స్రగ్విణి, వసంతతిల''కాది వృత్తములలో పద్యములను రచించెను. నిరోష్ఠ్యపద్యములు, సర్వతః ప్రాసపద్యములు, చతుః ప్రాసపద్యములు మొదలయిన చమత్కారములు చేసెను.

సీ॥ ''మందాకినీసుధా సందోహదుగ్ధాబ్ధి
సౌందర్యలహరుల చందమునను
మందారమల్లి కాకుందారవిందోరు
చందనపుష్ప రుక్చయముపగిది
ఇందిరాసుందరీమంది రాంతర్మక
రందనిర్ఝ రరుచిప్రతతిరీతి
ఇందుభృన్మంది సంక్రందన కరిమృగేం
ద్రఫణీంద్రదీప్తి బృందముల భాతి

తే॥ హారనీహారడిండీర శారదాభ్ర
హారకర్పూరతార కాకారకాంతి
కరణి నాకాశపంచకాంతరము
మండితములగు చిత్కళామండలములు''

సీ॥ సద్యస్తమోనాశఖద్యోతమానస
ద్విద్యుల్లతాప్రభావీథిపగిది" చిన్మయకళలువత్స''

ఇట్టివేకాక పూర్వకవుల పద్యములను బోలిన పద్యములెన్నో రచించెను. ఉదాహరణమునకు.

సీ॥ ఏకమై పరమైవిశోకమై సత్యమ
లోకమైవ్యాపకాలోకమగుచు.
జ్ఞానమై జగదధిష్ఠానమైముక్తిని
దానమైమాయావిహీనమగుచు.

పరమపరిపూర్ణ నిర్గుణబ్రహ్మమనఘ''

ఈపై పద్యము వసుచరిత్రలోని.

సీ॥ ''స్వామియై నిగమాతిభూమియై సురపురో
గామియైయబ్ధిజాకామియుండ''

అను పద్యమును బోలియున్నది.

ఉ॥ ''మాయను మిథ్యగాఁదెలియుమాయను.
దత్కృతమెల్లఁగల్లసు
మ్మాయను. మేనునేననకుమా యను.
సాక్షిని నీవుచూచుకొ
మ్మాయను. చూడగానితరమా యను.
నేననినిశ్చయించుకొ
మ్మాయను. కాకపోనితరమాయను మానము
మాను మాయనున్''

ఇది అయ్యలరాజు రామభద్రుని రామాభ్యుదయము నందలి.

''హా యను గాధినందనను ఘోరి నిశాటమదాపహారి బాహాయను'' పద్యమును దలపించును. ఇట్లు ప్రాచీనకవుల పద్యముల పోలికలితని కవిత్వమునందున్నవి. శ్రీ లింగమూర్తిగారి రచనలు 1. రతిమన్మథ విలాసము 2. జీవన్ముక్తి ప్రకరణము 3. బ్రహ్మనారద సంవాదము 4. తారక యోగము 5. మానసశతకము (కంద పద్యములు) 6. సీతారామాంజనేయ సంవాదము. ఇందులో రతిమన్మథ విలాసము మూడాశ్వాసముల ప్రబం

ధము. 2, 3, 4, 5, చిన్నవి శతకప్రాయము. సీతారామాంజనేయము మూడాశ్వాసముల గ్రంథము. 576 పద్యములతో విరాజిల్లునట్టి ఉత్తమ వేదాంతశాస్త్ర కావ్యము. వేదాంతశాస్త్ర రహస్యములను కావ్యరచనగా చేసి, ఆసక్తిగలవారు కంఠస్థము చేసుకొనుటకు వీలుగా రచింపబడిన వేదాంతశాస్త్ర గ్రంథము. తెలుగు వారికి ఇది తప్పమరి యొకటిలేదు. బహుశః సకలాంధ్ర ప్రాంతమందును రాజయోగరూపమైన వేదాంత విద్య వ్యాప్తిని జెందుటకు ఈ కావ్యమే మూలకారణమై యుండునని యూహింపవచ్చును.

## సీతారామాంజనేయ సంవాదము ఆధ్యాత్మిక తత్త్వవిశేషములు

శ్రీ పరశురామ పంతుల లింగమూర్తిగారి రచనలలో శ్రీ సీతారామాంజనేయ సంవాదము ఉత్కృష్టమైన రచన ''ఏకఃస్వాదునభుంజీత'' అనున్యాయమున గురుదేవులయనుగ్రహమువలన తానురుచిచూచిన యద్వైత తత్త్వామృతమును లోకమునకు పంచిపెట్టుటకై చేసినయుదార ప్రయత్నము. అతిగహనమై, అలతిప్రయత్నముచేత సాధ్యముకావిద్దై, కేవల వైరాగ్యయోగాభ్యాస తపశ్చర్యాదులచేతను, బ్రహ్మసూత్రాది ప్రస్థానత్రయ పఠనమననాదులచేతను ఎఱుగదగిన ఉపనిషత్సిద్ధాన్త రహస్యములను తేటతెనుగున విశదీకరించి. తెలుగు దేశమునందలి ముముక్షుజనమును ఉద్ధరించుటకై చేసిన యపూర్వ ప్రయత్నము. 576 పద్యములలో సంగ్రహించి చెప్పబడిన యీ వేదాంత సిద్ధాంత కావ్యము మూడాశ్వాసముల గ్రంథము. ప్రథమాశ్వాసమునందు తారకయోగమును, ద్వితీయాశ్వాసమునందు సాంఖ్యయోగమును, తృతీయాశ్వాసమునందు అమనస్కయోగమును విపులముగ వివరించి సాధకునికి కావలసిన సాధనసామగ్రి నంతటిని చేర్చి రచింపబడిన ఉత్తమరాజయోగ గ్రంథమిది.

"శ్రీమద్దివ్యనిజాంఘ్రి పద్మముల సంసేవించుచున్ భక్తిచే
ధీమంతుండగు నాంజనేయుని నసద్దేహేంద్రియాతీతచి
ద్భూమానందుఁడ వీవనేనని కృపన్ బోధించు శ్రీజానకీ
రామబ్రహ్మము నంతరంగమున నారాధింతు నశ్రాంతమున్"

అను పద్యముతోఁ గావ్యమునారంభించినాడు. ఉత్తమాధికారియైన హనుమంతు నకు "తత్త్వమసి"యను మహావాక్యార్థమును బోధించు సీతారామ బ్రహ్మ మును అనగా మాయాసహిత పరబ్రహ్మమును అంతరంగమున ఆరాధింతునని చెప్పుటలో లింగమూర్తి తాను ముక్తుడైనట్లును, సాధకుడు మొదటి మహావాక్య మైన "తత్త్వమసి" వాక్యము యొక్క వాచ్యార్థ లక్ష్యార్థముల నెఱిగిముందుకు సాగవలసియున్నట్లును సూచించి మంగళాచరణమును చేసినాడు. కావ్యార్థమం తయు ఈ పద్యమునందు సూచితమైనది. సాధారణ కావ్యమునందు వలెనే ఇష్ట దేవతా సుకవిస్తుత్యాదులను చెప్పిన పిమ్మట తన జన్మకు కారణమైన పరశు రామ పంతుల వంశమును వర్ణించుట సంసారబద్ధుని లక్షణముకనుక దానిని విడిచి, జ్ఞానోదయమునకును, ముక్తికిని కారణమైన గురు పరంపరనే వర్ణిం చెను. ప్రప్రథమమున తనకు బాల్యమునందు చిత్తశుద్ధిని కలిగించినవాడును, తారకయోగమును దెలిపినవాడునునగు "నారాయణ" గురువును స్మరించెను. తరువాత "మహాదేవ" గురినిభజింతుననెను.

సీ॥ "కమనీయవర దివ్యకాంచనచేలంబుఁ
గాషాయవస్త్రంబుగా ధరించి,
చాపబాణంబులు చంచత్కమండలు
దండముల్గాగహస్తములఁబూని,
రమణీయరత్నహారంబు రుద్రాక్షమా
లికగా గళంబున లీలఁదాల్చి,
సీతావధూటిని శ్రీరాజయోగా హ్వ
యాధ్యాత్మవిద్యగా నవధరించి,

గీ॥ ప్రేమ మీఱంగ "శ్రీరామ రామ రామ"
యనుచుఁదన పేరునుడువుచు నద్భుతముగ

## శ్రీ మహాదేవగురుఁడైన రామవిభుఁడు

### కరుణతోడుత నెదుర సాక్షాత్కరించె

తారకనాముడైన శ్రీరామచంద్రుడే మహాదేవగురు రూపమున లింగ మూర్తికి సాక్షాత్కరించెను. దీనివలన ఈ గ్రంథ రచనమునకు పూర్వమే లింగమూర్తి రామబ్రహ్మాద్వైతస్థితిని పొందియుండెననియు, గురువైన మహా దేవగురువు సన్యాసి యనియు, కావుననే శ్రీ లింగమూర్తి గురుమూర్తి తన యంత్యదశలో చతుర్థాశ్రమమును స్వీకరించి సన్యాసియయ్యెననియు మనము తెలిసికొనవలసియున్నది. అట్లు సాక్షాత్కరించిన రామబ్రహ్మాభిన్న మహాదేవ గురుడు లింగమూర్తితో'' ఇప్పుడీవు బ్రహ్మాండ పురాణాంతర్గతమైన 'అధ్యాత్మ రామాయణము' ఉమామహేశ్వర సంవాదరూపము, అందు శ్రీరామహృద యంబను నితిహాసము సీతారామాంజనేయసంవాదంబునఁ బ్రవర్తిల్లు. నది సంక్షేపరూపంబు గావున నయ్యర్థంబు విస్తరించి యొక్క ప్రబంధంబుగా రచియించి, నాపేర నంకితంబు సేయుము. సర్వపాప వినిర్ముక్తుండవై కృతా ర్థుండవయ్యెదవ''ని యానతిచ్చితిరోహితుండయెను. లింగమూర్తి స్వప్నము నుండి మేల్కాని పరమానంద భరితాంతః కరణుడై.

శా॥ ''శ్రీ విశ్వేశ్వర పార్వతీ ప్రియదమున్ శ్రీజానకీరామ వా
క్యావిర్భూతము మారుతాత్మజ సుబోధ్యం బైతగన్ శ్రీ మహా
దేవాచార్య వరాంకితంబుగను ధాత్రిన్ రాజయోగంబు సం
భావింపన్ రచియింపఁగల్గె నికనాభాగ్యంబు సామాన్యమే?''

అని తలచెను. గురు పరంపరాభి వర్ణనమునందు ''శ్రీ దత్తాత్రేయగురుండు, జనార్దన గురువు, ఏకో గురుస్వామి, నరహరి మహేశగురుడు, శ్రీ నాగోరామ గురుడు, కోనేరు గురుడు అను వారిని పేర్కొని వారి యెడల భక్తి ప్రపత్తులను జూపెను. ఆకోనేరు గురుని శిష్యుడు శ్రీ మహాదేవగురుడు మహాదేవగురునికి సాక్షాత్తుగా శిష్యుడై లింగమూర్తి అధ్యాత్మ విద్యారహస్యముల నెఱిగి ధన్యు డయ్యెను.

అధ్యాత్మ రామాయణము వ్యాసభగవానునిచేత శ్రీ మద్రామాయణ కథా నాయకుడైన శ్రీ రామచంద్రుని మహత్వవిశిష్టమైన పరతత్త్వభావమును వెల్ల

డించుటకై రచింపబడిన గ్రంథము. జగత్తత్త్వమును, పరబ్రహ్మతత్త్వమును, వేదరహస్యములను విపులముగా వివరించు స్వభావముగలవి పురాణేతిహాసములు. "ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అట్టి వేదోపబృంహణాత్మకములైన పురాణములను, వేదముల తత్త్వము నెఱిగి, వేదవిభాగము చేయగలిగిన వేదవ్యాసుడే చెప్పవలయును. కనుక బ్రహ్మాండ పురాణాంతర్గతముగా నీయధ్యాత్మరామాయణమును వ్యాసుడురచించెను. మహాకవియు, ఆది కవియునైన వాల్మీకి మునీంద్రుడు రచించిన శ్రీ మద్రామాయణము కావ్యధర్మ ప్రధానముగాను, లోకవృత్త బహుళముగాను కనపడుటచేత, బహుజనులు శ్రీ రామచంద్రునిని ఉత్తమక్షత్రియ వీరుడుగాను, ఏకపత్నీవ్రత, సత్యవ్రత, పితృవాక్యపాలనా తత్పరత్వాది గుణములు గల నరుడుగానే యెఱుగుదురుగాని, నారాయణునిగాను సర్వజగదధిష్ఠానమైన పరబ్రహ్మనుగాను ఎఱుగరు. వాల్మీకి శ్రీరాముని పరతత్త్వభావమును సూచించి విడిచెనేకాని విపులముగా వర్ణింపలేదు. అందుచేతనే వ్యాసభగవానుడు లోకానుగ్రహకాంక్షచేత వాల్మీకి హృదయమును అధ్యాత్మరామాయణ రచనతో వెల్లడించెను.

"వేదవేద్యేపరేపుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా"

వేదములచేత, అనగా చివరిభాగమైన ఉపనిషత్తులచేత, తెలుసుకోదగిన పరమపురుషుడైన, అఖండ సచ్చిదానంద ఘనమైన పరబ్రహ్మము శ్రీ రామచంద్రావతారమునెత్తగా, వేదములు వాల్మీకి మునివల్ల రామాయణ రూపమున అవతరించినవి. అను తత్త్వమును పదే పదే వెల్లడించుచున్న అధ్యాత్మ రామాయణము పార్వతీదేవికి పరమశివుడు చెప్పినట్లుగా రచింపబడినది. తత్త్వజిజ్ఞాసురాలైన పార్వతీదేవికి శ్రీరాముని చరిత్రము సర్వజన సాధారణముగానే కనపడి, "అతనిని అందఱు భగవదవతారమందురు, మనకు గూడ అతని యెడల భక్తి యున్నది. రాముడు పరాత్పరుడే యైనను అవిద్యాసంవృతమైన తన ఆత్మతత్త్వమును ఇతరులు చెప్పినప్పుడే తెలుసుకొన్నాడు, ఆత్మతత్త్వము నెఱిగినవాడే యైనచో సీతకొఱకు ఎందుకు విలపించెను, అలాంటి వానిని దైవభావనతో సర్వులును సేవింపవలసిన యవసరమేమి? ఈనాహృత్సంశయ బంధనమును విడదీయవలసినద"ని పరమశివుని ప్రశ్నించెను. ఆ ప్రశ్నకు సమాధానముగా,

"ధన్యాసిభక్తాసి పరాత్మనస్త్వం యత్ జ్ఞాతుమిచ్ఛాతవ రామవృత్తమ్,
పురానకేనాప్యభిచోదితోహం వక్ష్యేనమస్కృత్యరఘూత్తమం తే॥
రామః పరాత్మాప్రకృతే రనాదిరానంద ఏకః పురుషోత్తమోఽహి"

అని ప్రారంభించి, రామ చరితమును ఆత్మతత్త్వ రహస్యములతో సమన్వయించుచు, రామాయణ కథనంతటిని మళ్లీ ఏడు కాండలలో చెప్పెను. రామ పట్టాభిషేకమైన పిమ్మట సీతారామాంజనేయులకు జరిగిన సంవాదమునందు వ్యక్తమైన రామతత్త్వమునే అధ్యాత్మ రామాయణము ద్వారా పరమేశ్వరుడు పార్వతికి బోధించెను. "శ్రీ రామహృదయము" అధ్యాత్మ రామాయణములోని బాలకాండయందలి ప్రథమసర్గలో నుపనిబద్ధమైయున్నది. "అత్రతే కథయిష్యామి రహస్యమతి దుర్లభమ్। సీతారామమరుత్సూను సంవాదం మోక్షసాధనమ్," అని పరమశివుడు సీతాదేవి ఆంజనేయునికి చెప్పినట్లు చెప్పెను.

"రామంవిద్ధి పరంబ్రహ్మ సచ్చిదానందమద్వయమ్,
సర్వోపాధి వినిర్ముక్తం సత్తామాత్రమగోచరమ్,
ఆనందం నిర్మలంశాంతం నిర్వికారం నిరంజనమ్,
సర్వవ్యాపిన మాత్మానం స్వప్రకాశమకల్మషమ్.
మాం విద్ధిమూల ప్రకృతిం సర్గస్థిత్యంతకారిణీమ్
తస్యసన్నిధిమాత్రేణ సృజామీదమతంద్రితా।
తత్సాన్నిధ్యాన్మయా సృష్టంతస్మిన్నారోప్యతేఽబుధైః।
అయోధ్యానగరేజన్మ............ఏవమాదీని కర్మాణి
మయైవాచరితాన్యపి. ఆరోపయుంతిరామేస్మిన్
నిర్వికారేఽఖిలాత్మని॥ ఇత్యాదిగాచెప్పిన పిమ్మట,
శ్రీ రామచంద్రుడు ఆంజనేయునితో స్వయముగా,
"శ్రుణుతత్త్వం ప్రవక్ష్యామి హ్యాత్మానాత్మ పరాత్మనామ్.
ఆకాశస్యయథాభేదస్త్రివిధోదృశ్యతేమహాన్
జలాశయే మహాకాశస్తదవచ్ఛిన్న ఏవహి।
ప్రతిబింబాఖ్యమపరం దృశ్యతేత్రి విధంనభః"
ఇత్యాది విషయములు చెప్పి, చివర

''ఇదం రహస్యం హృదయం మమాత్మనో
మయైవ సాక్షాత్కథితం తవానఘ।
మద్భక్తిహీనాయ శఠాయనత్వయా
దాతవ్యమైంద్రాదపి రాజ్యతోఽధికమ్''అని

చెప్పినట్లున్న భాగమే శ్రీరామ హృదయము. ఈ శ్రీరామ హృదయమును విస్తరించి సాధక జనోపయోగకరముగా ''సీతారామాంజనేయ సంవాదమను'' గ్రంథమును రచింపుమని శ్రీమహాదేవగురువర్యుడు శ్రీ లింగమూర్తితో చెప్పుటకు కారణము. అధ్యాత్మ రామాయణములోని శ్రీరామ హృదయాంతర్గతమగు పై శ్లోకమును, రామభక్తి మోక్షఫలదాయిని యగుటయు. (నాహృదయమును, నాస్వరూపమును, నేనే స్వయముగానీకు చెప్పితినని శ్రీరామచంద్రుడాంజనేయునితో నన్నమాటయే ఈ శ్లోకము).

అధ్యాత్మ రామాయణమునందలి ''రామగీత'' మహాభారతమునందలి భగవద్గీతవంటిది. భగవద్గీతను శ్రీ కృష్ణుడు అర్జునునికి బోధించెను. ''రామగీత''ను శ్రీ రామచంద్రుడు లక్ష్మణునికి చెప్పెను. ఇది అధ్యాత్మ రామాయణమునందలి ఉత్తర కాండలోని పంచమసర్గము. ఏకసర్గాత్మకముగా నిబంధింపబడిన యీ ''రామగీత''లో శ్రీ రామచంద్రుడు లక్ష్మణునికి ఆత్మసంధాన ప్రకారమును బోధించి, ''అనాద్యవిద్యోద్భవ బుద్ధిబింబితో జీవః ప్రకాశోఽయమితీర్యతేచితః''అని జీవలక్షణమును, ''ఆత్మాధియః సాక్షితయా పృథక్స్థితో బుద్ధ్యాపరిచ్ఛిన్నపరః సఏవహి''అని ఆత్మ లక్షణమును చెప్పి,

''ప్రకాశరూపోఽహమజోఽహమద్వయోఽ
సకృద్విభాతోఽహమతీవ నిర్మలః।
విశుద్ధ విజ్ఞానఘనో నిరామయః
సంపూర్ణ ఆనందమయోఽహమక్రియః''

అని తాను పరాత్పరాభిన్నుడనని బోధించెను. బోధించుటయే,

కాక॥ ''యః సేవతే మామగుణం గుణాత్పరం
హృదాకదావాయదివా గుణాత్మకమ్,
సోఽహం స్వపాదాంచిత రేణుభిః స్పృశ-
న్పునాతి లోకత్రితయం యథారవిః''

అని జీవ బ్రహ్మతాదాత్మ్యమును, తత్ఫలితమును అభివర్ణించెను. అట్టి శ్రీరామ హృదయము సంక్షేపరూపముగానుండి, సాధకులకు, అందును సంస్కృత భాష నెఱుగనివారికిని సులభగ్రాహ్యముగాకుండుటచేత మహాదేవగురునాజ్ఞ ప్రకారము ముముక్షువులైన సాధకులకు పరబ్రహ్మ తత్త్వస్వరూపజ్ఞానమును ప్రసాదించుటకై శ్రీ లింగమూర్తి గురుమూర్తి అత్యంత విపులమై, సర్వయోగ రహస్యములను, సర్వశాస్త్ర రహస్యములను, తారక, సాంఖ్య, అమనస్క యోగోపదేశాభ్యాస వివరములతో విరాజిల్లినదైన శ్రీ సీతారామాంజనేయ సంవాదకావ్యమును రచించెను.

పార్వతి ప్రశ్నకు సమాధానముగా పరమశివుడు

"శ్రీమనోరామ ! శ్రీరామ రామరామ
యనుచు రమియింతు రామునియంద, రామ
నామము వరానన ! సహస్రనామతుల్య
మట్లుగావున దీని నీ వవధరింపు"

అని ప్రారంభించి శ్రీరామనామ పదమున కర్థమునుదెలిపి, "రామపదవాచ్యుం డాదినారాయణుండె"యని బోధించి, "తారకపావనరామనామ" ప్రభావమును గొనియాడి శ్రీరామనామ మంత్రాధికారి లక్షణములను వివరించి, తదుపాసనా ఫలమునుగొనియాడి, రామాయణ కథను సంగ్రహించి చెప్పి, శ్రీరామ పట్టాభిషేకమును వర్ణించెను. పట్టాభిషిక్తుడైన రాముని పాదసన్నిధిలో నిటలతటఘటితాంజలియై, నిరాకాంక్షుడై, నిత్యానిత్యవస్తు వివేకముచేతను, సకలవిధైహికాముష్మికభోగ విరక్తిచేతను, శమాదిషట్క సంపత్తిచేతను విరాజిల్లుచు ముముక్షువైన హనుమంతుని జూచి శ్రీరామచంద్రుడు కరుణా రసభరితుడై సీతామహాదేవితో మనకు నిత్యభక్తుడును, మదీయజ్ఞానాసక్తుడును, పరమభాగవత శిఖామణియునైన యితనికి నాదివ్య తత్త్వస్వరూపము నుపదేశింపుమని యానతిచ్చిన విధముగా గ్రంథము నారంభించెను. ఆ తరువాత తారక యోగ ప్రధానమైన ప్రథమాశ్వాస విషయములను సీతాదేవి ఆంజనేయునికి బోధించినట్లు నడపెను.

శ్రీ రాముని యానతిచేత సంతసించి మందస్మిత ముఖారవిందయై విశ్వమోహినియైన (మాయాశ్వరూపిణియైన) సీతామహాదేవి యాంజనేయుని కభిముఖియై తారకయోగమును బోధించునదియై ప్రప్రథమమున హనుమంతునకు శ్రీరామచంద్రునియందు పరబ్రహ్మ భావనకలుగుటకై యిట్లువర్ణించెను,

సుమతీ : రాముఁడు నిర్వికారము సదాశుద్ధంబు బుద్ధంబచిం
త్యమవాచ్యంబతులంబ తీంద్రియము సత్తామాత్రముఁ స్వప్రకా
శము నిర్ద్వకదము నిర్వికల్పమజముఁ సత్స్వంచిదానందరూ
ప మమూర్తంబజరంబు కేవల పరబ్రహ్మంబు చింతింపఁగఁ"

అట్టి పరబ్రహ్మమైన రామునికి నిత్యానపాయినినై మూలప్రకృతి రూపిణినైన నావల్లనే సమస్తసృష్టి జరుగుచున్నది. శ్రీరామజననము మొదలుకొని జరిగిన రామాయణ కథయంతయు నాచేతనడుపబడినదే. అది తెలియనివారు నిర్వికారుడును అఖిలాత్మకుడునైన రామునియందు ఆరోపించుచున్నారు. అనిచెప్పగా హనుమంతుడు సీతాదేవితో,

"రామచంద్రుడు తారకబ్రహ్మమగుట
సత్యమగుగాని, యిమ్మహా సర్వమయుని
సులభముగఁగాంచు పరమసు సూత్రమెద్ది
నాకెఱింగింపవమ్మ లోకైకజనని !"

అని యడిగెను. సీతాదేవి నవ్వుచు,

తే॥ "ప్రత్యగాత్మ స్వరూపుడై పరగు తనకు
రమణ పరమాత్ముడైన శ్రీరామునకును
సమరసైక్యానుసంధాన సరణియెద్ది
అదియ యోగంబు సదుపాయ మాంజనేయ !

అని చెప్పెను.

"ఆంజనేయా ! నీవు పరబ్రహ్మము నాకంటే భిన్నమని తలచుటచేత అతనిని దెలిసికొనుట కుపాయముచెప్పుమని కోరుచున్నావు. నీకంటె (జీవుని కంటె) రాముడు (పరబ్రహ్మము) వేఱుకాదు. కనుక అనాదియైన భ్రాంతిచేత వేఱువేఱుగా కనపడుచున్న జీవ బ్రహ్మలు ఒకటియేయని శాస్త్ర సిద్ధాంత, గురూపదేశ, యుక్తులచేత నిశ్చయించుకొని యా విషయమును మనస్సునందు దృఢపఱచుకొనుటకై ధ్యానముచేయవలెను. ఆధ్యానమున కనుకూలమైన మార్గమేదికలదో అదియే యోగము. యోగ మొక్కటియే పరబ్రహ్మ స్వరూపము నెఱుగుటకు చక్కనియుపాయము". అని చెప్పి యోగస్వరూపమును వివరించును.

ఆయోగము "అభ్యాసయోగము, జ్ఞానయోగము" అని రెండు విధములు. అభ్యాసయోగమునకు ప్రాణాయామయోగ"మని కూడ పేరున్నది. అభ్యాసయోగమునకు వాయునిరోధము ప్రధానము. ప్రాణాయామయోగము, "మంత్రయోగము, లయయోగము, హఠయోగము" అని మూడు విధములు. ఈ యోగము నభ్యసించువారు యమనియమాదులను, ప్రత్యాహార ధ్యానాదులను, వేదధ్యయనము, భక్తి, యోగాసనములు, రేచక పూరక కుంభక భేదములు గల ప్రాణాయామము మొదలయిన వాని నన్నిటిని పాటించి యోగమును సాధింపవలయును. ఈ యభ్యాసయోగముచిత్తపరిపాకములేని వారికి మాత్రమే యవసరము. ఇది మిక్కిలి కష్టమైన యోగము. దీనిని సాధించినవారికి అణిమాద్యష్టసిద్ధులు కలుగును. పరిశుద్ధమగు మనస్సుగలవారికీయోగముతోఁబనిలేదు. వారు రెండవదియైన జ్ఞానయోగము నాశ్రయించిన చాలును. ఆయోగమునకే రాజయోగమని పేరు. అది వారికి బ్రహ్మజ్ఞానమును యోగాభ్యాసక్లేశము లేకయే యిచ్చును. ఈ రెండు యోగములలో నేది సిద్ధింపవలయునన్నను భక్తి వైరాగ్యములు ఆవశ్యకములు.

అతిసులభమైన విజ్ఞానయోగము (జ్ఞానయోగము) "రాజయోగము" అనబడును. ఈ యోగసాధకుడు "అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, శౌచము, శారీరకతపస్సు (దేవద్విజ గురుప్రాజ్ఞ పూజన శౌచార్జవ బ్రహ్మచర్యాహింసాదులను పాటించుట), వాఙ్మయతపస్సు (సత్యప్రియహితమును అనుద్వేగకరమునైన వాక్యము, స్వాధ్యాయాభ్యసనము

కలిగియుండుట) మానసికతపస్సు (మనః ప్రసాద సౌమ్యత్వమౌన భావసంశుద్ధ్యాత్మ నిగ్రహాత్మకము) అను త్రివిధతపస్సులను, సంతోషమును, స్వాధ్యాయమును, ఈశ్వరప్రణిధానమును (ఏకాదశేంద్రియములు పూజాపాత్రలుగాను, దశవిధప్రాణములు సేవకులుగాను, ఇడ పింగళ సుషుమ్నాదినాడులు అభిషేక జలముగాను, అధారాదిషట్కమలములు పుష్పములుగాను, జఠరాగ్నిధూపముగాను, చిత్కళలుదీపములుగాను, బ్రహ్మానందమునై వేద్యముగాను, సూర్యచంద్ర మండలజ్యోతు లారతులుగాను, శరీరమనెడి దేవాలయమందలి సహస్రారకమలమనెడి సింహాసనమున శాంతియను సీతతోఁ గూడిన పరబ్రహ్మము శ్రీరాముని నిరంతరముగా పూజించుచుండుటయే ఈశ్వరప్రణిధానము) కలిగియుండిన చాలును. ఈ రాజయోగము మిక్కిలి పరిశుద్ధమైనట్టిది. మోక్షేచ్ఛగలవారిచేత అవశ్యము తెలిసికొనదగినట్టిది. అనాదిసిద్ధమై దక్షిణామూర్తి హయగ్రీవాది జగద్గురువులచేత ఆదరింపబడినట్టిది రాజగుహ్యమైన (రహస్యములలో నెల్ల రహస్యమైన) ఈ రాజయోగమును శ్రద్ధతో ఆశ్రయింపలేక మూఢులైనవారు సంసార సముద్రమున మునుగుచుందురు. శ్రీ రామునిదయకు పాత్రులైన భక్తులు ఈ యోగమువలన సిద్ధినిపొందుదురని చెప్పి, ఇది మూడు విధములుగా నున్నట్లు తెల్పెను.

గీ॥ ''రాజయోగంబు ముక్తికి రాజపథము
రాజగుహ్యంబు పరమంబు రాజవిద్య.
అదియుమూడు విధంబుల నలరుచుండు
సాంఖ్య, తారక, సమనస్కము లనంగ''

(రాజయోగంబు-జ్ఞానయోగము. రాజపథము-వంకర లేని చక్కని రాజ మార్గము. రాజగుహ్యము-మిక్కిలి రహస్యమైనట్టిది. రాజవిద్య-సకలవిద్యలలో నుత్తమమైనట్టిది—ఉపవాస, వాయుభక్షణ, పర్ణభక్షణాదులచేతను, హఠయోగాదిక్లేశముల చేతను శ్రమింప నవసరములేక సుఖముగా రాజువలెకూర్చుని సాధింపదగిన యోగము కనుక దీనికి ''రాజయోగము'' అను పేరురూఢమై ముముక్షువుల నాకర్షింపగలుగుచున్నది). తారకయోగము, సాంఖ్యయోగము, అమనస్కయోగము, అనునవిదీనిమెట్లు. సాధకుడు మొదట తారకయోగమును

సాధించి, సాంఖ్యయోగమును స్వాయత్తముచేసికొని, అమనస్కయోగ సిద్ధుడు కావలయును. అప్పుడతనికి జీవన్ముక్తియు, విదేహకైవల్యమును కరతలామలకములగును.

తారకయోగము :

మితాహారము, ధ్యానసమయమున కూర్చొనుటకు మెత్తనియాసనము, వివిక్తప్రదేశము, ఏర్పరుచుకొని యచ్చట పద్మాసనాసీనుడై, మెడను శిరస్సును చక్కగానిలిపి, దృష్టిని నాసాగ్రమునందుచేర్చి, బుద్ధిని, చిత్తమును, ప్రాణవాయవు, దశేంద్రియములు అనువాని వ్యాపారములను అరికట్టి, మౌనవ్రతమును బూని, కామక్రోధాదివికారములకు లోనుగాక, చిత్తశాంతిగల్గి, నిర్భయుడై, బ్రహ్మచర్యమును బూని, తన గురువుచెప్పిన లక్ష్యముపై మనస్సును నిలిపి, దినమునకు రెండుజాములకాలము పూనికతో యోగమును అభ్యసింపవలయును. ఇది, తారకసాంఖ్యామనస్కయోగములను సాధించువారందఱికిని సాధారణము. ఇతరుల మాటయెట్లున్నను తారకయోగము నభ్యసించు వానికి మాత్రము ఈ నియమముల వశ్యాచరణీయములు.

తారకయోగమనగా "నాదము, బిందువు, కళ"అను వానిని ప్రత్యక్షముగా ననుభవించి, పిమ్మట వానికి లయస్థానమైన పరబ్రహ్మమునందైక్యమును పొందించుటయే. ఈ నాదబిందుకళలు సాధారణమైన యింద్రియ వ్యాపారమునకు గోచరములుకావు. వాని ననుభవించుటకు ఇంద్రియ మనస్సులనంతర్ముఖములుగాఁ జేయవలయును. అట్లు చేయుపద్ధతికి 'ముద్ర' అనిపేరు. ఖేచరి, భూచరి, మధ్యమ, షణ్ముఖి, శాంభవి అని ముద్రలైదు విధములు. సద్గురువు ఉపదేశించిన మార్గమున వీనిని యెఱిగి, యభ్యసింపవలయును. ఆయభ్యాసమువలన "నాదబిందుకళలు" గోచరించును (1) భ్రూమధ్యమున దృష్టిని నిలిపి యూర్ధ్వముఖముగా చూచుట ఖేచరీముద్ర (2) దృష్టిని కదలింపక నాసాగ్రమును చూచుచుండుట భూచరీముద్ర (3) కనులను సగముమూసియుక్క నడిమి భాగమున దృష్టిని నిలిపి అచ్చటి నుండి పైభాగమున నున్న భ్రూమధ్యమును జూచుట మధ్యమాముద్ర (4) చెవులను, కన్నులను, నాసారంధ్రములను మూసి, దృష్టిని మనస్సుతో గూడ భ్రూమధ్యమునందు స్థిరముగ నిలిపి నాదబిందుకళల ననుభవించుట షణ్ముఖీముద్ర. ఈ ముంద్రయందేకాక

ప్రతిముద్రయందును దృష్టియెచ్చటనుండునో మనస్సు కూడ నచ్చటనేయుండ వలయును (5) అంతర్లక్ష్యము, అనగా కన్నులను మూసికొని మనస్సును చూపును నాదబిందుకళలయందుంచుట, బహిర్లక్ష్యము, అనగా వెలుపటనున్న యొక వస్తువునుగాక బయలువైపునకు నిశ్చలముగా చూచుచు నాదబిందుకళల ననుభవించుటకు 'శాంభవీముద్ర'యని పేరు. ఈ ముద్రాభ్యాస ఫలముగా నాదబిందుకళలు గోచరించువానికి పరమాత్మ తత్త్వము సులభముగా దెలియును. ఈ యోగము నభ్యసింపని వానికి ఇంద్రియ మనస్సంయమనము సాధ్యపడదు.

నాదము :

సద్గురు ప్రోక్తమైన ముద్రచేత కర్ణములను మూసికొని వినినచో ప్రణవము (ఓంకారము) "చిణి"యని యొకమాఱును "చిణిచిణి"యని చిఱుగజ్జల మ్రోతవలెనొక మాఱును, మ్రోగును. ప్రాణవాయువుల సంచారమువలన బుట్టుధ్వనియే యిది. ఇదియేనాదము. ఇది ఘంటానాదమువలెను, పిమ్మట శంఖనాదమువలెను మ్రోగును. అభ్యాసక్రమమున వీణానాదమువలెను, వేణునాదమువలెను, భేరీనాదమువలెను, తొమ్మిదవమాఱు మృదంగ నాద రూపముననను, పదియవమాఱు మేఘధ్వని రూపముగాను ఆ ఓంకారము మ్రోగును. ఈ దశవిధ ప్రణవనాదములను గురూపదేశ పూర్వకముగా శ్రుతియుక్త్యనుభవముల చేత నెఱుగవలయును. హృదయమున గోచరించు నీ నాదరసామృతమును గ్రోలినవాడు పరమ పురుషుడగును.

బిందువు :

అనగా అంతఃకరణము, అది చలింపక నిలిచి గోచరింపవలెను, దానికై హంసతత్త్వమును, దాని అష్టదళ పద్మవిహారమును, దాని స్వరూపమును దెలియవలయును. ప్రాణాది వాయుదశకముతోను, దశేంద్రియములతోను గూడిన మనస్సు శబ్దాదీంద్రియార్థముల ననుభవించును. విషయములను గ్రహించుటకై యుది అధోముఖముగానున్నది. అదియే హృదయకమలము. హృదయకమలము స్థానముగా చేసికొని బుద్ధి సంచరించుచుండును. ఆ బుద్ధి ప్రాణవాయువునకును మనసునకును అగ్రభాగమునందుండును. దానికే బిందు వని పేరు. సకల విధములగు వాసనలకును, కార్యకారణములకును అదియే ఆశ్రయము.

అది సుషుప్తి దశలో అజ్ఞాన రూపమును, జాగ్రదవస్థలో అంతఃకరణ రూపమును పొందును. అనాదికాలమునుండి మోక్షముగలుగు వరకును కర్మల నాచరించునదియు, కర్మఫలముల ననుభవించునదియు ఆ బిందువే. కర్తృత్వ భోక్తృత్వములు బిందువునకే కాని ఆత్మకులేవు.

కళలు :

ఈ కళలు వెనుకచెప్పిన ఖేచర్యాది ముద్రల ద్వారా దర్శించు యోగికి భ్రూమధ్య మార్గముపైకి గోచరించునట్టి యాకాశమునందు హృదయాకాశాది పంచవిధాకాశములు గోచరించును. ఆయాకాశపంచక మధ్యమునందు,

సీ॥ మందాకినీ సుధా సందోహదుగ్ధాబ్ధి
సౌందర్యలహరుల చందమునను,
మందార మల్లికా కుందారవిందోరు
చందన పుష్పరుక్చయము వదిగి,
ఇందిరాసుందరీ మందిరాంతర్మక
రంద నిర్ఝరరుచి ప్రతతిరీతి,
ఇందుభృన్నంది సంక్రందనకరి మృగేం
ద్ర ఫణీం ద్రదీప్తిబృందముల భాతి,

తే॥ హార నీహార డిండీర శారదాభ్ర
హార కర్పూర తారకాకార కాంతి
కరణి, నాకాశపంచ కాంతరమునందు
మండితములగుఁ జిత్కళా మండలములు''

ఇంకను మెఱపులవలెను, మిణుగురుబురువు కాంతులవలెను, ఇంద్రనీలవజ్ర వైడూర్యాది మణికాంతులవలెను కనపడుచుండును. అంతేకాక తాను చూచుచున్న యాకాశమునందంతటను లెక్కకు మిక్కిలిగా నొక్కసారి యుదయించి వ్యాపించిన సూర్యకిరణములవలె గనుపించును. ఆ పిమ్మట బ్రహ్మాండముల నన్నిటినీ ఒక్కసారిగా ప్రకాశింపజేయజాలునట్టి జ్ఞానసూర్యుడు సాక్షాత్కరించును.

కనుక, సూక్ష్మమైన ప్రాణవాయు మనస్సుల అగ్రమునందుండు బుద్ధియే బిందువు,దానియందు ప్రతిఫలించు పరమాత్మ ప్రతిబింబమే చిత్కళ సుషుమ్నాదినాడులయందు ప్రాణవాయువులు సంచరించుటవలనఁ గలుగు శబ్దమే ప్రణవ నాదము. ఓంకారమునందని (అ+ఉ+మ్=ఓమ్) అకారమునకు దశ విధ నాదములు అర్థము. ఉకారమనగా బిందువు. మకారమునకు చిత్కళలు అర్థము. కనుక ఓంకారము నాద బిందు కళాత్మక మని చెప్పబడును.

ఇవియు నింకనువలసిన సర్వవిషయములును తారకయోగాభ్యాసమునకై బోధించి, సీతామహాదేవి ఆంజనేయునితో,

సీ॥ పరమహంసంబురేపగలు చింతింపంగ
బిందు విందందుఁ గంపింపకుండ,
దశవిధ ప్రణవనాదము లాలకింపంగఁ
దుదనుఘంటానాద మొదవిమ్రోయ,
బహులక్ష లక్ష్యముల్ పరికించిచూడంగ
సురుచిరంబై స్వయంజ్యోతి యొప్పు,
యామద్వయంబు యోగారూఢుడై వాని
ధ్యానింపఁ దన్మయత్వంబు గలుగు

తే॥ నట్టియున్మని యందు మనోనిలములు
వివిధ విషయేంద్రియములతో విలయమొందు,
నిదియెసూ సర్వవేదాంత విదిత పరమ
రాజయోగంబు దేవతారాజి వినుత''

యనిచెప్పి తారకయోగమును ఉపసంహరించెను.

అధ్యాత్మరామాయణమునందు స్వల్పముగానున్న సీతావాక్యములాధారముగా నీ తారకయోగము, తత్పూర్వమందున వివిధయోగశాస్త్ర రహస్యములతో కూడిన అభ్యాసయోగము (ప్రాణాయామ ప్రధానయోగశాస్త్రము) కూడా శ్రీ లింగమూర్తి సీతామహాదేవి ద్వారా చెప్పించుట సమంజసముగానున్నది.

అమె పరమాత్మ (శ్రీరామచంద్రుని) యొక్క శక్తిరూపమైన మూలప్రకృతి యగుటవలన సాధకుని స్థానమునందుండి, చిత్కళాభిన్నమై వేద్యమైన పరతత్త్వమీ విధముగా గోచరించునని ఆంజనేయునికుపదేశించుట యుక్తియుక్తముగాను, సులభజ్ఞేయముగాను నున్నది. ఆమె చెప్పిన విషయమును ధ్రువీకరించుచు శ్రీరామచంద్రుడు,

తే॥ "తెలిసెనయ్య! సీతాదేవి తెలియఁజెప్పఁ
గలిత తారకయోగ ప్రకారమెల్ల ?
ఇంకనీవయిఁగరుణచే నెఱుకపఱుతు
సాంఖ్యయోగంబు వినుమా ప్రసంగమనఘ !"

యని యాంజనేయునితోననుచు నుపనిషదర్థ ప్రతిపాదకములైన సాంఖ్యయోగా మనస్కయోగములను వివరించెను. మొదట సాంఖ్యయోగమును జెప్పువాడై ప్రకృతి పురుష వివేకము తెలియుటకై ప్రకృతినంటకయుండు నిర్గుణ పరబ్రహ్మస్వరూపమును వర్ణించి నిరూపించెను. ఆ పరబ్రహ్మ, చిత్కళాకలాపలాలిత ప్రకాశుడుగాను, అవిద్యాధ్వాంత ద్యుమణిగాను, విద్యాసద్యోవేద్యుడుగాను, అపరిచ్ఛేద్యుడుగాను, సర్వప్రపంచ సాక్షిగాను ఉన్న ఆద్యుడనిచెప్పి, ఆ పరమాత్మకు భిన్నమైన ప్రకృతిని గురించి బోధించెను. అందులో 'మాయ' అనునది అనాదిగా పరమాత్మయందున్న ఆత్మశక్తియే.

---

అది అవ్యక్తమై జగత్తుకు కారణమైయున్నది. వటబీజమున మహీరుహాశక్తి, అగ్నియందుష్ణశక్తి, వాయువునందు చలనశక్తివలె కనపడనిదగుచు, ఆత్మయందున్న మాయ, విశ్వశృష్టికి కారణమగుచున్నది. దానినే "మూలప్రకృతి, మాయ"అని చెప్పుదురు. అని సాంఖ్యమునారంభించి వివరములు తెలిపెను.

ఆ మాయ మదీయమైనదే, అయితే అది ఆత్మవిజ్ఞానము చేత నశించును గనుక 'సత్తు' కాదు. నేను (అజ్ఞానిని) అను లోకవ్యవహారమువలన ఉనికిగలది యగుటచేత 'అసత్తును' కాదు. 'సదసత్తు' అసంభవము కనుక అదియునుకాదు. నిఖిలజగత్స్వరూపముగలది కనుక 'నిరవయవమును' కాదు. దృశ్యప్రపంచము సుషుప్తియందు నశించినను తాను నశింపదు కనుక 'సావయవము'ను కాదు 'నాసత్త' కంటే మరియొక సత్తలేదు గనుక నాకంటె భిన్నమును కాదు.

"అవిద్య, ప్రకృతి, అజ్ఞానము"అని వ్యవహరింపబడుచుండుటచేత మదభిన్నమును (నేనేయనుటకు వీలులేదు) కాదు. నేను జ్ఞానస్వరూపుడను, మాయ అజ్ఞానస్వరూపిణి, కనుక మాయిద్దఱికిని ఐక్యము సంభవింపదు. కనుక అది అని ర్వాచ్యము. బ్రహ్మానుభవజ్ఞాన దృష్టితో చూచినపుడు అది నీచము; తర్కదృష్టితో చూడగా అనిర్వచనీయము; సామాన్యమగు లోకదృష్టితో చూచినప్పుడు "అనంతము." త్రాడుసర్పమై, స్థాణువు పురుషుడై, ఎండ మావులు జలమై, ఆకాశము నల్లనిదియై కనపడినట్లు, పరబ్రహ్మము స్వతః అద్వితీయనిర్మల సత్యజ్ఞానానంద స్వరూపమై (నేను) యున్నప్పటికిని, భేద యుక్తముగాను, అసత్య, జడ, దుఃఖ, రూపమైన ప్రపంచముగా తోచుటకు కారణమేదియో, ఏది అభేదజ్ఞానముకలుగగానే అభావరూపమై (త్రికాలముల యందును అసలేలేనిదై) కనపడదో అదియే మదీయమాయాతమస్సు (అజ్ఞానము). అది ప్రాణులయందలి సుషుప్తిరూపముగలదియై సమస్త ప్రపంచవాసనామయమై, త్రిగుణాత్మకమై, తనయందు దాచుకోబడిన అనంతకోటిజీవ సంఘాతము కలదియై, కేవల జడమై, మోహస్వరూపిణియై సకల జగత్తుకు ఉపాదానకారణము (ఘటమునకు మృత్తువలె) అగుచున్నది. (ఈ ఉపాదాన కారణత్వము భ్రాంతిమూలకము) ఈ నామాయనే "అవిద్య, అవ్యక్తము, తమస్సు, సుషుప్తి, ప్రకృతి, ప్రళయము, ప్రధానము, మాయ, అజ్ఞానము, అనాది"అను శబ్దములతో వ్యవహరించుచున్నారు.

ఆదిమధ్యాంత శూన్యయగు ఆ ప్రకృతి, ఆదిమధ్యాంతములున్నట్లుతోచి, ఆదిమధ్యాంతములు లేని నన్ను (పరమాత్మను) ఆవరించి, ఆదిమధ్యాంతములు కలవానినిగా చేయుచున్నది. ఆ మాయ, అనగా మూలప్రకృతి, 'మాయ' అనియు, 'అవిద్య' అనియురెండు విధములు. కేవల సత్త్వగుణ ప్రధానమైనది మాయ. రజస్తమోగుణ సంబంధముగల సత్త్వగుణము ప్రధానముగా గలది అవిద్య, కనుక ప్రకృతి, మాయారూపమున నన్ను ఆవరించుటయు, అవిద్యా రూపమున ఆవరించుటయు నను రెండు ఆవరణములు నాకుకలిగెను. ఆ సత్త్వప్రధాన మాయయందు దానికధిష్ఠానమైన నేను, ఆకాశము మేఘముల యందలి నీటిలో ప్రతిఫలించినట్లు ప్రతిబింబించితిని. అట్లు ప్రతిబింబించిన శుద్ధచైతన్యంబును, మాయయు, ప్రతిబింబమును కలిసి ఈశ్వర శబ్దముచేత వ్యవహరింపబడుచున్నది. ఆ మాయకు ఈశ్వరుడులోబడక బ్రహ్మరూపుడు గానే యుండును.

కం॥ ఆయీశ్వరుండ నేనా
మాయయె సీతావధూటి, మదిందలపమహా
మాయుడనయ్యు వశీకృత
మాయుడనై యవతరింతు మహినిట్లనఘా!

అని శ్రీరామచంద్రుడు ఆంజనేయునితో తాను లోకోపకారార్థమై భూలోకము నందు రామావతారము నెత్తితినని స్పష్టపరచెను.

మలిన సత్వప్రధానమైన మాయయే 'అవిద్య' కదా! ఆ అవిద్యయందు అధిష్ఠానమైన నేను (ఆత్మ) కడవలోని నీటియందు మేఘనక్షత్ర సహితమైన ఆకాశచ్ఛాయవలె ప్రతిబింబించి 'జీవుడు' అనబడుచున్నాను. కాగా, సాధకుడు, జీవుడు కార్యోపాధియనియు, ఈశ్వరుడు కారణోపాధియనియు గ్రహింప వలెను. ''కార్యోపాధిరయం జీవఃకారణోపాధిరీశ్వరః'' అని వచనము. (ఆకాశము మేఘగత జలమునందును, మేఘజలమునకు కార్యమైన ఘటజల మందును ప్రతిఫలించును) ఆ జీవునికి, ఆనందమయకోశమను పేరుగల వ్యష్టిజ్ఞానము కారణశరీరము. వ్యష్టిసుషుప్తి అవస్థ, ఈ రెంటియందును అభిమానము గల అతనికి ''ప్రాజ్ఞుడు''అని పేరు, ''ప్రాణానాం ధారణాజ్జీవః'' మొదలయిన ప్రమాణముల వలన, ప్రాణముల కధికారియగునంత వఱకు జీవుని జీవత్వము పరిపూర్ణముగాదు. కాబట్టి ఆ తరువాత సూక్ష్మప్రపంచ సృష్టిజరిగినది. దానికి జీవుల యదృష్టము (పూర్వకర్మలు) కారణము.

సత్వప్రధాన మాయా సమన్వితుడైన ఈశ్వరుని సృష్టీచ్ఛచేత తన్మాత్రలు (శబ్దాదులు), పంచభూతములు, వానివలన ఇంద్రియములు, మనోబుద్ధ్యహంకారచిత్తములు, కర్మేంద్రియములు, ప్రాణాపానాది వాయుపంచకము, తత్తద్దేవతాకములై జన్మించినవి. ఇట్లు పుట్టిన జ్ఞానేంద్రియపంచకము, అంతఃకరణచతుష్టయము, కర్మేంద్రియ పంచకము, ప్రాణాది పంచకము కలిసి ఏకోన వింశత్యవయవంబులు గల లింగశరీరమేర్పడెను ఈ సూక్ష్మశరీరము వృక్షము, వనమువలె ఒక్కటి వ్యష్టియనియు, సర్వము సమష్టియనియు చెప్పబడును. వీటికి వ్యష్టిస్వప్నము, సమష్టిస్వస్వప్నము క్రమముగా అవస్థలగును. అందు వ్యష్టిసూక్ష్మాంగ స్వప్నములయందు ప్రాజ్ఞుడు అభిమానియై,

ప్రాతిభాసికుడై, తైజసుడనబడును. సమష్టిసూక్ష్మకాయ స్వప్న విశిష్టుడనై ఈశ్వరుడనైన నేను హిరణ్యగర్భుడు మొదలయిన పేర్లతో సర్వజీవోపాస్యుడనై యుందును. ఇది సూక్ష్మసృష్టి,

స్థూలసృష్టియంతయు నీశ్వరరూపము భూమి మూలాధారకమలము, అగ్ని స్వాధిష్ఠానకమలము, జలము మణిపూరకకమలము. వాయువు అనాహత కమలము, ఆకాశము విశుద్ధకమలము, మనోబుద్ధిరూపిణియగు ప్రకృతి ఆజ్ఞా కమలము, మేరుపర్వతము బ్రహ్మదండి (వెన్నెముక) దక్షిణాయనము ఇడా నాడి, ఉత్తరాయణము పింగళానాడి, మోక్షము సుషుమ్నానాడి.

సీ॥ "అతలంబు పదములు, వితలంబుగుల్ఫముల్
సుతలంబుజంఘికల్ సుజననివహ
సుత ! రసాతలము జానువులు, దారుణమహో
తల మూరువులు, తలాతలముకటియు.
నాగలోకము మహోనాభ్యధోభాగంబు,
భూర్భువస్వర్లోకములునునాభి,
జఠర వక్షంబులు సరిమహర్లోకంబు,
కంఠంబు సుజనలోకంబు, ముఖము

తే॥ మజీలపోలోకమరయ భ్రూమధ్యంబు, సత్యలోకంబు విపుల
మస్తకము సుమ్మ"
విశ్వరూపధరుండనై వెలయునాకు, జలనిధిగభీర ! వీరకేసరి
కుమార !

అనిచెప్పి, జీవేశ్వరైక్యమును వివరించి, శుద్ధచైతన్యమును విలోకింపవలయునని చెప్పి "తత్త్వమసి"యను మహావాక్యార్థమును బోధించెను, భ్రాంతివలన త్రాడుపామైతోచి, ఆప్తవాక్యమువలన భ్రాంతి తొలగగానే త్రాడు స్వస్వరూపముతో నిలుచును. అట్లే అనాదియగు అవిద్యవలన ఆత్మ తనకుతానే జీవుడై తోచును. సద్గురు వాక్యమువలన భ్రాంతితొలగి దేహేంద్రియ ప్రాణబుద్ధి మనోఒహంకారములే తాను అని తలచుటను మాని స్వస్వరూప మాత్రుడై

నిలుచును. కావున జీవబ్రహ్మలెన్నటికిని భిన్నులుకారు. ఆ యైక్యోపాసన ఓంకార రూపుడైన పరమేశ్వర ధ్యానమేయనిచెప్పి ఓంకారస్వరూపమును జెప్పి తానాప్రణవ స్వరూపుడనని చెప్పెను. ఆంజనేయుడు ఓంకార వాచ్యార్థమునుగాక లక్ష్యార్థమును జెప్పితరింప జేయుమని కోరగా "పంచకోశ వివేచనమును సోదాహరణముగా బోధించి బ్రహ్మస్వరూపమును దెలిపెను. ఆత్మస్వరూపను అతిస్పష్టముగా నెఱుగుటకు "దృగ్దృశ్య వివేకమును దెలిపి యెక్య విధానమును బోధించెను. పంచభూతమయమగు సర్వప్రకృతిని గణించి జీవసహితముగా పంచవింశతి తత్త్వముల స్వరూపము నెఱిగించి స్థూలసూక్ష్మకారణ శరీర భిన్నుడైన యాత్మను, పరమాత్మను, వివరించి బోధించెను. సర్వసాక్షిత్వమననము చేయుపద్ధతిని దెలిపి, తాను సర్వమును ప్రకాశింప జేయుచున్నట్టు సోదాహరణముగా వివరించెను. అఖిల భూతములయందు తాను, తన యందఖిల భూతములుగలవని చెప్పిదానికి గగనము నుదాహరణముగా జూపెను. ఆరూఢుని లక్షణమును, ఆరురుక్షుని లక్షణమును, సాధకుని లక్షణమును, సద్రూప లక్షణమును, పంచప్రళయముల వివరణమును, చిద్రూప లక్షణమును, ఆనంద లక్షణమును, అఖండ లక్షణమును, తెలిపి ఆంజనేయునికి అవిద్యాంధతిమిరము నంతటిని బాపి, కేవలతత్త్వరూపమును జూపి, సాంఖ్యయోగమును ముగించెను.

సంఖ్యా శబ్దమునకు "గణనము, జ్ఞానము"అను నర్థములుగలవు. మూలప్రకృతినుండి పుట్టిన ప్రకృతి వికృతరూపములైన చతుర్వింశతి తత్త్వములను, జీవుని, గణించి వివరించి తెలుపునది కాబట్టియు, జ్ఞానస్వరూపమైన ఆత్మతత్త్వమును, "నేతినేతి" వచనములతో "ఇది ఆత్మకాదు, ఇది ఆత్మకాదు"అని ప్రకృతిని దూరముచేసి బోధించుశాస్త్రము గనుకను దీనికి సాంఖ్యశాస్త్రమని పేరు. ఈ శాస్త్రాని సారముగా పరమాత్మస్వరూపము నెఱుగుటకై చేయు సాధనకు సాంఖ్యయోగమని పేరు.

సీతారామాంజనేయ సంవాద గ్రంథమునందలి తృతీయాశ్వాసమునందు శ్రీరామచంద్రుడాంజనేయునికి "అమనస్కయోగ"మును బోధించుట విషయము. అమనస్కయోగమనగా అనుభవయోగము. ఆంజనేయుడు శ్రీరామ బోధిత పరమసాంఖ్య రాజయోగ సమాధినుండి మేల్కొని, బ్రహ్మానంద భరితాంతః కరణుడై, తన యెదుటనున్న సీతారామగురునికి సాష్టాంగ దండ

ప్రణామము లాచరించి యనేక విధములుగానుతించెను. ఆస్తోత్రమునందు తనకు బోధపడిన సాంఖ్యతత్త్వమునంతటిని పునరుద్ఘాటించి, తనకుగలిగిన ఆపూర్ణ బోధ స్థిరతరంబుగనుండునట్లు వరమీయమనివేడగా శ్రీ రాముడాంజనేయునిని కరుణా కటాక్షమున జూచి "అమనస్క-యోగము" నుపదేశించెను. "ఈ అమనస్క-యోగమును పరిశుద్ధ చిత్తులు గానివారు గ్రహింపనేలేరు. వెనుక చెప్పిన తత్త్వ విచారమునెఱిగి భావమునందు ఆత్మానాత్మ విభాగమును జేసుకొనగల మేధావికిఇది నిత్యసుఖముగా స్పష్టముగా తెలియును. వానికి పువ్వులు గోయుటయు, కన్నులు మూసుకొనుటయు నెంతసులభమో అంతసులముగా నీ యమనస్క-యోగము సిద్ధించును. అమనస్క-యోగమును గ్రహించి అమృతపానముచేసినట్లు సర్వ కాలములయందు ఆత్మావలోకనమువలన పరమానందము ననుభవించు పుణ్యా త్మని మోక్షలక్ష్మి దగ్గరకు జేర్చును. ఈ యమనస్క-యోగప్రాప్తి లేని కేవల తారకసాంఖ్యయోగాశ్రితులకు నిత్యనిర్మలాఖండ సుఖము గలుగనేరదు తారక సాంఖ్యములు మనోనిగ్రహము కొఱకు జెప్పబడినవేకాని సిద్ధాంతములుగావు. అమనస్కమే అనాదిసిద్ధమై, మనోహరమై, రహస్యమైన రాజయోగము. ఇదియే నిర్వికల్ప సమాధి.

బాగుగా విచారించినచో నీ ప్రపంచమంతయు మనస్సునకంటే భిన్నము కాదు. స్థూలసూక్ష్మ శరీరములు, ప్రమాణములచేత విషయములను గ్రహించు నట్టి ప్రమాత, ప్రమాణము, ప్రమేయము, కామరాగాది వృత్తులు, సర్వధర్మ ములు, బంధమోక్షములు, సర్వప్రపంచము కూడ మనస్సే, మనస్సునందే సర్వసంసారము, ఆ సంసారమునకు ఉత్పత్తిస్థితిలయములును మనస్సునందే ఎట్లనగా సుషుప్తిలో మనస్సులయమును పొందినప్పుడు ఏదియు కనపడదు. జాగ్రదవస్థలో సర్వముగోచరించును. కనుక మనస్సే ప్రపంచమనుటలో సంశయములేదు. అట్లే బంధమోక్షములు. నాదియని మనస్సు తలచుట బంధము, నాదికాదనుకొన్నప్పుడు మోక్షము. కనుక మనస్సే కార్య రూపమును దాల్చి సంకల్పాదిరూపమును, కారణరూపమును దాల్చి అవిద్యాదినామములను దాల్చును. ఈ అమనస్క-యోగము సిద్ధించుటకు క్రొత్త సాధనములేమియులేవు. అది విజ్ఞానవంతులకు కరతలామలకమే. మనస్సు భ్రాంతిచేత పరబ్రహ్మయందారోపింబడినదే కావి బ్రహ్మస్వరూపము నెఱిగిన వారికి అది గోచరించనే గోచరింపదు. రజ్జువునందు సర్పభ్రాంతి కలిగినవానికి భ్రాంతితొలగి, యిది రజ్జువే. అని యధిష్ఠానమును దెలిసికొనగానే, ఆరోపిత

మగు సర్పముకానరానట్టును, అధిష్ఠానమైన స్తంభమును దెలిసికొనగానే పురుషుడు కనబడనట్లును, ఎండమావులని తెలియగానే ఆరోపితమైన జలము అదృశ్యమైనట్లును, సర్వాధిష్ఠానమగు బ్రహ్మమును విజ్ఞానముచేత నెఱిగిన పిమ్మట నా బ్రహ్మమునందారోపింపబడిన మనస్సు బొత్తిగాకానరాదు. ఇట్టి మానసికానుభూతిని సాధించుటకు విజ్ఞానము తప్ప మరియొక సాధనమున వసరములేదు. "నిత్యానిత్య వస్తువివేకము, వైరాగ్యము, శమాదిషట్క సంపత్తి, మోక్షేచ్ఛ" అనుసాధన చతుష్టయమును సంపాదించి, పూర్ణాధికారము కలిగిన తరువాత, నీవే, నీయథార్థస్వరూపమును గుఱించి విచారించి నిర్ణయింప వలయును.

నీవు, "నేను జీవుడను"అని తలచుచున్నావు. నశించుదానిని (క్షరము నంతటిని) ఆత్మగాభావించుచున్నావు. అధిష్ఠానమగు బ్రహ్మమును ఎఱుగ జాలకున్నావు. కనుక నీ భ్రాంతినివదలి మొదట 'నేతినేతి' (ఇదిజడముగనుక ఆత్మకాదు) అను వాక్యము ననుసరించి, ఇవి పంచకోశములు అని క్షరము నంతటిని (వ్యష్టిదేహాదులనన్నింటిని) విభాగించి, ఇవి నాకంటే వేఱు, వీటిని నేను చూచుచున్నాను కనుక ఇవి నా స్వరూపము కానేరవు అని నిర్ణయించు కొనవలయును. అప్పుడు ప్రతిబింబ భూతుడవైన నీకు అధిష్ఠాన భూతమైన బ్రహ్మమే (లేక కూటస్థుడే) నీ స్వరూపభూతుడని తెలియును. వాస్తవస్థితిలో 'ఇతడుజీవుడు'అను భావము 'ఇదిపాము'అని త్రాటిని జూచియనుకొనుటవంటిది. కనుక వ్యష్టినుండి నీ స్వరూపమును విభాగించి కూటస్థ మాత్రునిగా తెలిసు కొని, పిమ్మట సమస్త దేవమనుష్యాది పంచకోశములను, వానికి కారణములగు పంచభూతములను 'ఆత్మకాదు'అని నిషేధించి, బ్రహ్మరూపమును వాటికంటే వేఱుగా నిర్ణయింపవలయును. ఈ విధముగా కూటస్థబ్రహ్మలను వ్యష్టిసమ ష్టులనుండి వేఱుచేసి, పిదప ప్రపంచమంతయు భ్రాంతిసిద్ధమే కనుక, దానికి జ్ఞానముకంటే భిన్నమగు స్వరూపమే లేకపోవుటవలన 'ప్రపంచము శూన్యము, అది బ్రహ్మముకంటె వేఱుకాదు'అనియు, సర్వత్రా కూటస్థబ్రహ్మలు మాత్రమే కలరు, ఇతర మేమియులేదు' అనియు నిశ్చయముగా తెలిసికొనవలయును.

అట్టి జ్ఞానముకలిగిన పిమ్మట "అహంబ్రహ్మాస్మి, ప్రజ్ఞానంబ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ, తత్త్వమసి"అను మహావాక్యముల ననుసరించి, అకూటస్థ

బ్రహ్మలకు భేదములేదు.''అని శ్రుత్యుక్త్యనుభవ పూర్వకముగా తెలిసికొనవలయును. సమిష్టిప్రపంచరూపమగు వాచ్యార్థమును తొలగింపగా 'తత్' పదమునకును, బ్రహ్మపదమునకును లక్ష్యార్థమగు పరబ్రహ్మంబును, వ్యష్టిప్రపంచరూపమగు వాచ్యార్థమును తొలగింపగా 'అహం' పదమునకును. 'ప్రజ్ఞాన' పదమునకును, 'ఆత్మ' పదమునకును, 'త్వం' పదమునకును లక్ష్యార్థమగు కూటస్థుడును, జ్ఞానస్వరూపులే, కనుక వీరికి 'భేదముకలుగదు' అని నిశ్చయించుకొనవలయును. ఇట్టి నిశ్చయము కుదిరి ''జీవబ్రహ్మైక్యము'' అనుభవమునకు వచ్చిన పిదప సూర్యునికి చీకటికానరానట్లు నీకు కారణకార్యరూపమైన మనస్సు కానరాదు. వాస్తవస్థితిలో మనస్సు పరబ్రహ్మమునందు ఆరోపితమే కనుక, సర్పము రజ్జువునందులేనట్లు నీలో మనస్సులేనేలేదు కావున అమనస్కస్థితి స్వభావసిద్ధమేకాని సాధనసాధ్యముకాదు. నీకు 'నేనుజీవుడను'అని భ్రాంతికలిగినప్పుడు ఈ దృశ్యప్రపంచము (మనఃపర్యంతమైన ప్రకృతి) గోచరించును. ''నేను బ్రహ్మమును''అని తోచగానే ఈ దృశ్యప్రపంచమంతయు నశించును, యాథార్థస్థితిలో బ్రహ్మకు ప్రతిబింబమనునదియే లేదుకదా! కనుక అమనస్కస్థితి స్వాభావికమేగాని సాధనసాధ్యముకాదు.

ఓవత్సా! ఇట్టి యఖండజ్ఞానము సంపాదించినచో, కనులుమూసినను తెఱచినను బాహ్యాభ్యంతరములయందు సచ్చిదానందరూప పరబ్రహ్మమే గోచరించును. అట్టి జ్ఞానము కలుగనిచో ఎచ్చట చూచినను మనోవికారములే గోచరించుచుండును.

మ॥ ఘనతఁ దారకసాంఖ్యయోగములచే కష్టింపగానేల? నె
మ్మనముఁ బట్టగనేల? ఇంద్రియములఁ మర్దింపగానేల? చ
క్కనగాముందటఁగానిపించు ఘటముఁ గన్నట్లు బ్రహ్మంబుగాఁ
తనుఁదాఁగాంచిన యంతలో, నిఖిలముఁదానై వెలుంగుఁదగఁ."

గీ॥ ఇతర సంకల్పములులేక యెపుడుఁదాను
సచ్చిదాత్ముఁడనని సుప్రసన్నవృత్తిఁ
దన్నుఁగను వానిచిత్తంబు తనకుఁదాన
పొలియు తనయంద, నింధనానలము పగిది.''

అని యాంజనేయునికి శ్రీరామచంద్రుడు సర్వవికారశూన్య సహజామనస్క రాజయోగ సమాధిని గుఱించి తెల్పెను. ఆ తరువాత అమనస్కయోగమును సాధించు సాధకునికి మనస్సు కలదా? లేదా? యని ప్రశ్నించిన మారుతికి ఆ సంశయనివృత్తి నిగావించుటలో అదియున్నను, సూర్యుని యెదుటనుంచిన దీపము వలె నిష్ప్రయోజనమనియు, తద్వికారము లేవియు కలుగవనియు బోధించి, మనస్సు స్వరూపమును, మాయాతత్త్వమును దెలిపి, యమనస్కయోగమును ముగించి, "శ్రీరామరామరామ"యను మంత్రార్థమును బోధించెను. సర్వము బ్రహ్మమని తెలిసినవాని వర్తనమును, బ్రహ్మవిత్, బ్రహ్మవిద్వర, బ్రహ్మవిద్వరీయ, బ్రహ్మవిద్వరిష్ఠుల లక్షణమును, వైరాగ్య, బోధ, ఉపరతుల, తారతమ్య కారణరూప కార్యాచార ప్రకారమును, వైరాగ్యశబ్దార్థవిమర్శనమును, బోధశబ్దార్థ వివరణమును, గురుప్రాధాన్యమును, గురుశుశ్రూషాప్రాముఖ్యమును, మహావాక్యార్థ వివరణమును. స్థితప్రజ్ఞునిలక్షణమును, పంచదశయోగాంగ విభాగములను చిత్తలయముగల పురుషుని లక్షణమును, వైరాగ్యబోధోపరతులుగల యోగి లక్షణమును, జీవన్ముక్తుని లక్షణమును జెప్పి ఇదియే వేదశాస్త్రసారము, అనంతసౌఖ్యదమైన రాజయోగశాస్త్రము, ఇదియే బ్రహ్మవిద్య, ఇదియే నా హృదయము అని ముగించెను. అప్పుడాంజనేయుడు సర్వమును కరతలామలకముగావించుకొని, సీతాదేవి లక్ష్మియనియు, లక్ష్మణుడు శేషుడనియు, భరత శత్రుఘ్నులు పాంచజన్య సుదర్శనములనియు, సింహాసనము సుపర్ణుడనియు, శ్రీరామచంద్రుడాదినారాయణుడనియు నెఱిగి, పరమానంద కందళిత హృదయారవిందుడై శ్రీ సీతారామగురుచరణములకు నమస్కరించి యనేక విధములు గాస్తుతించెను.

## శరీరమునందలి ఆత్మస్థానము (అనుబంధము)

"పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖమ్"
అధోనిష్ట్యావితస్త్యాంతే నాభ్యాముపరి తిష్ఠతి,
జ్వాలమాలాకులంభాతి విశ్వస్యాయతనం మహత్,
సంతతగ్ం శిలాభిస్తు లంబత్యాకోశ సన్నిభమ్,
తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మంతస్మిన్ త్సర్వం ప్రతిష్ఠితమ్,
తస్యమధ్యేమహానగ్నిర్విశ్వార్చిర్విశ్వతోముఖః
సోఽగ్రభుగ్విభజన్తిష్ఠన్నాహార మజరఃకవిః
తిర్యగూర్ధ్వమధశ్శాయీ రశ్మయస్తస్యసన్తతాః

సంతాపయతి స్వం దేహమాపాదతలమస్తగః
తస్యమధ్యేవహ్నిశిఖా ఆణీయోర్ధ్వావ్యవస్థితః
నీలతోయద మధ్యస్థాద్విద్యుల్లేఖేవభాస్వరా
నీవారశూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా
తస్యాశ్శిఖాయామధ్యే పరమాత్మావ్యవస్థితః
సబ్రహ్మసశివస్సహరిస్సేంద్ర స్సోక్షరః పరమస్వరాట్."

మానవుని కంఠమునకు క్రిందుగా నాభికిపైగా నడుమగల ద్వాదశాంగుళ ప్రమాణమైన భాగంలో అధోముఖమై, ముకుళితమై హృదయకోశమున్నది. ఆ హృదయకోశమునందు పరమాత్మ ఉన్నాడు. ఆ హృదయకమలము నాశ్రయించి జ్వాలమాలలచేత ప్రకాశించుచు, అనేక నాడీమండలములు వ్రేలాడుచు జీవునికి ముఖ్యస్థానమై, కొంచము వికసించిన తామరమొగ్గతో సమమైన ఆ హృదయాగ్రమునందు సూక్ష్మమైన ఒకకమలాకారమైన సుషిరం (రంధ్రం) ఉంది. దానియందే సర్వమును ప్రతిష్ఠింపబడియున్నది. దానినడుమ జ్వలించుచున్న జఠరాగ్నియగు వైశ్వానరుడున్నాడు. ఆయగ్ని భుక్తమైన ఆహారమును విభజించును. అది ఊర్ధ్వముగ, అడ్డముగా, క్రిందుగానున్నది. దాని కిరణములు ఆపాదతల మస్తకము వ్యాపించియుండును. ఆ జఠరాగ్నినడుమ సూక్ష్మములైన అగ్నిజ్వాలలు ఊర్ధ్వముగా ప్రసరించుచున్నవి. అవి నల్లని మేఘములోని మెఱపులవలెనున్నవి. వాటిమధ్యన నివ్వరిధాన్యపుగింజపైనుండు ముల్లువలె సన్నగా అణువువలె పసుపుపచ్చ రంగుతో ఒక అగ్నిశిఖ ఉన్నది. ఆ శిఖామధ్యమునందు పరమాత్ముడున్నాడు. ఆ పరమాత్ముడే బ్రహ్మ, రుద్రుడు, విష్ణువు, ఇంద్రుడు, అక్షరుడు, కూటస్థుడైన, స్వప్రకాశముగల సర్వాంతర్యామి"అని, మంత్రపుష్పము చెప్పుచున్నది.

మానవదేహమునందలి వెన్నెముకకు 33 వెన్ను పూసలుండును. పూసకు పూసకుమధ్యనగల ప్రదేశములనుండి నాడులుబయలుదేరును అవి యనేకములు (72 వేలు) అందులో వెన్నుపూసనడమ మూలాధార చక్రము నుండు ఆజ్ఞాచక్రము వరకు నుండు ప్రధానమైన నాడికి "సుషుమ్నానాడి" అని పేరు దీనిని ఆయుర్వేద పరిభాషలో "జీవనాడి" అందురు. దీనికి కుడివైపున "ఇడనాడి" (ఇళా) ఎడమవైపున "పింగళనాడి" (పింగళా) ఉండును.

ఇడను 'సూర్యనాడి'అని పింగళను 'చంద్రనాడి'అని యందురు. పద్మకోశ ప్రతీకాశమైన "హృదయకోశము" అనగా ప్రాణకోశము, సుషుమ్నానాడిలో, కంఠమునకు క్రిందుగా, నాభికిపైగానున్న ద్వాదశాంగుళ ప్రమాణమైన ప్రదేశము నందుండునని పైమంత్రమున కర్థము. ఆ ప్రాణకోశమునందు మిక్కిలి కాంతిమంతము, శక్తిమంతము అయిన ఆత్మ, విద్యుల్లేఖవలెనుండును అక్కడ జీవుడు (ప్రత్యగాత్మ, లేక ఉపాధిగ్రస్తమైన పరమాత్మ) ఉండును.

"తదేజతి తన్నైజతి తద్దూరే తద్వన్తికే ।
తదన్తరస్య సర్వస్యతదు సర్వస్యాస్య బాహ్యతః

(ఈశోపనిషత్తు-౫)

ఆ ఆత్మతత్త్వము చలించును, చలింపదు (స్వతః అచలమైనప్పటికిని చలించునట్లు కనిపించునని భావము), అది అజ్ఞానులకుదూరము, జ్ఞానులకు సమీపము. సర్వాంతర్యామి (సూక్ష్మరూపమున ప్రాణులయందుండును, నామ రూపక్రియాపూర్ణమైన జగత్తునకు బహిర్వ్యాప్తముగాను ఉన్నది.

"హృదిహ్యేషఆత్మా, అత్రైతదేకశతం
నాడీనాం, తాసాంశతంశతమేకైకస్యాం
ద్వాసప్తతిర్ద్వాసప్తతిః"

(ప్రశ్నోపనిషత్తు-తృతీయః ప్రశ్నః-6)

ఈ ఆత్మ హృదయమందుండును ఈ హృదయమునందు 101 ప్రధాననాడులు కలవు. అందులో ప్రతినాడికిని నూరు నూరు శాఖలున్నవి. అందొక్కొక్క దానికి 72 వేల సూక్ష్మనాడులున్నవి.

అంగుష్ఠమాత్రః పురుషోఽన్తరాత్మా
సదాజనానాం హృదయే సంనివిష్టః ।
తం స్వాచ్ఛరీరాత్ప్రవృహేన్ముంజాదివేషికాం
ధైర్యేణ । తం విద్యాత్ శుక్రమమృతం, తం
విద్యాత్ శుక్రమమృతమితి

(కఠోపనిషత్తు-తృతీయవల్లి-మం 17)

పరాంతరాత్మయైన అంగుష్ఠమాత్ర పురుషుడు సదా జీవుల యొక్క హృదయమునందుండును. ఆ పురుషుని తన శరీరమునుండి ధైర్యముగా ముంజిగడ్డి నుండి లోపలి ఊచనువెలికి తీసినట్లు వెలువరించి పరమాత్మలో లీనము చేయవలెనని భావము.

ఈ విధముగా ఆత్మ (జీవుడు) ప్రాణుల హృదయమునందునట్లు ప్రమాణములున్నవి. ఈ హృదయము ఆధునికులను కొనుచున్న (Heart) గుండెకాయకాదు, సుషుమ్నానాడీ మధ్యస్థమైన ఆత్మకోశము. (అని విద్వాంసుల అభిప్రాయము)

ఈ విధముగా ననేక వేదాంత సిద్ధాంతములను సులభసుందరమైన తెలుగు కవితతో లోకమున కందించిన శ్రీ పరశురామపంతుల లింగమూర్తి గురుమూర్తి ఆంధ్రదేశమునకు ప్రాతఃస్మరణీయుడు. ఆయన రచించిన "సీతారామాంజనేయసంవాదమే" తెనుగుదేశమున వేదాంత విద్యను, (సంస్కృతమును చదువక పోయినప్పటికిని) బహుజనులు కులమత స్త్రీ పురుషభేదము లేక సుమారు రెండువంల సంవత్సరములనుండి యభ్యసించుటకు వీలగుచున్నది ఈ గ్రంథము ఆధారముగానెన్నియో చిఱుపొత్తములు, గీతములు, కందార్థములు, తత్త్వములు మొదలయిన వేదాంతసాహిత్యమునకు సంబంధించిన రచనలు బయలుదేరినవి.

వేదాంతవిద్య, తారకామనస్క సాంఖ్యయోగములు, వ్యక్తిని బాగుపరచుటయేకాక సమాజమును గూడ బాగుపరచును. లోకమునందు రాగద్వేషములు, ఈర్ష్యాసూయలు, దురాశ, దుర్వ్యవహారము. పెల్లుబికిన కామక్రోధాదులు, పరస్త్రీ పరధనాపేక్ష మొదలయిన దుర్గుణములన్నియు నుపశమించుటకు తోడ్పడును. విశ్వశాంతికి మూలమగును.

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః

ఓం తత్సత్

---

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

Ba'

BC
AOHA105B1/4/2

# మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B142 |
| పుస్తకం పేరు | పరశురామపంతుల లింగమూర్తి జీవితము సాహిత్యము |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 75 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | G, BG |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | [illegible] |
| పేజీలు విడదీసినది | vedavathi |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |